


# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY



ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
అధ్యక్షులు ఆవుల విజయభాస్కర రెడ్డి అడ్వకేట్ B.A.L.L.B
ఆళ్లగడ్డ
9440232308,9494498787



PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి బుధవారం15 డిసెంబరు 2021 సంపుటి : 03 సంచిక : 112 పేజీలు : 4 వెల : రూ


# కాశీ రూపురేఖలను మార్చేశాం



వారణాసి : కాశీ ముఖచిత్రాన్ని ప్రభుత్వం మార్చివేసిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. కాశీ ప్రతిష్ట, శక్తి నలుదిశలా విస్తరిస్తోందని అన్నారు. ప్రధాని మోదీ మంగళవారం సద్గురు సదఫల్‌దేవ్ విహంగమ్ యోగ్ సంస్థాన్ 98వ వార్షిక వేడుకల్లో పాల్గొని సద్గురు సదఫల్‌దేవ్‌కు నివాళులు అర్పించారు. అనంతరం మెగా వారణాసి ర్యాలీని ఉద్దేశించి ప్రసంగించారు.విశ్వనాధ్ ధామ్‌ను కాశీ నగరం ఆ మహదేవుడికి అంకితం చేసిందని కాశీ విశ్వనాధ కారిడార్ ప్రారంభోత్సవాన్ని ప్రస్తావిస్తూ పేర్కొన్నారు. ఇక స్వాతంత్ర్య పోరాటంలో సన్యాసుల పాత్రను చరిత్ర ప్రస్తావించలేదని విస్మయం వ్యక్తం చేశారు. భారత స్వాతంత్ర్య సమరంలో సద్గురు సదఫల్‌దేవ్‌తో పాటు ఎందరో సన్యాసులు పాల్గొన్నా వారి సేవలను ప్రస్తుతించాల్సిన స్థాయిలో చరిత్రలో పొందుపరచలేదని అన్నారు.అంతకుముందు వారణాసిలో తన రెండో రోజు పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ కాశీ విశ్వనాధ్ ఆలయ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం బీజేపీ ముఖ్యమంత్రులతో సుపరిపాలనపై ప్రధాని మోదీ సమాలోచనలు సాగించారు.ప్రధాని నరేంద్ర మోదీ రెండు రోజుల వారణాసి పర్యటనలో భాగంగా మంగళవారం ఉదయం బీఎల్‌డబ్ల్యూ గెస్ట్ హౌస్‌లో సమావేశమయ్యారు. ఉత్తరప్రదేశ్ సహా పలు రాష్ట్రాల్లో వచ్చే ఏడాది ప్రారంభంలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మోదీ ఈ సమావేశం ఏర్పాటు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

## బీజేపీ పాలిత రాష్ట్రాల సీఎంలతో సమావేశమైన మోదీ



బీజేపీ పాలిత రాష్ట్రాల పనితీరును ఈ సమావేశంలో ప్రధాని సమీక్షించినట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. రాష్ట్రాల పురోగతికి సంబంధించి సీఎంలు ప్రజెంటేషన్ ఇచ్చినట్టు తెలుస్తోంది.అసోం, అరుణాచల్ ప్రదేశ్, గోవా, గుజరాత్, హర్యానా, హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక, మధ్యప్రదేశ్, మణిపూర్, త్రిపుర, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రులతో పాటు బీహార్, నాగాలాండ్ ఉప ముఖ్యమంత్రులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. దీనికి ముందు సోమవారంనాడు కాశీ విశ్వనాథ్ ఆలయం దర్శనం సమయంలోనూ బీజేపీ ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రులు ఆయనతో కలిసి పాల్గొన్నారు. కాగా, ప్రధాని తన రెండో రోజు పర్యటనలో భాగంగా మధ్యాహ్నం 3.30 గంటలకు వారణాసిలోని స్వర్‌వేద్ మహామందిర్‌లో నిర్వహించే సద్గురు సదఫల్‌దేవ్ విహంగం యోగ్ సంస్థాన్ 98వ సెలబ్రేషన్స్‌లో పాల్గొంటారు.

# జనవరి 9న ఈబీసీ నేస్తం అమలు: సీఎం జగన్

## కలెక్టర్లు, ఎస్పీలతో సీఎం స్పందన వీడియో కాన్ఫరెన్స్

తాడేపల్లి: కొత్త ఏడాదిలో పెన్షన్ రూ.2500కు పెంచుతున్నట్లు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు. జనవరి 1, 2022 నుంచి అమలు చేయనున్నట్లు వెల్లడించారు. సీఎం జగన్ మంగళవారం జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో స్పందన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం.. డిసెంబర్, జనవరిలో నిర్వహించే కార్యక్రమాలను వెల్లడించారు. డిసెంబర్ 21న సంపూర్ణ గృహహక్కు పథకం, డిసెంబర్ 28న ఈ ఏడాది ఏప్రిల్ తర్వాత చేపట్టిన వివిధ పథకాలు, కార్యక్రమాల కింద వివిధ కారణాలవల్ల మిగిలిపోయిన లబ్ధిదారులకు ప్రయోజనాల పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.జనవరి 9న ఈబీసీ నేస్తం అమలు చేస్తామని.. అగ్రవర్ణాల్లోని నిరుపేద మహిళలకు (45?60ఏళ్లు)3 ఏళ్లలో రూ.45వేలు లబ్ధి చేకూరనుందన్నారు. జనవరిలోనే రైతు భరోసా అమలు చేస్తామని.. తేదీ త్వరలోనే ప్రకటిస్తామని సీఎం తెలిపారు.కోవిడ్‌లో కొత్త ఒమిక్రాన్ వేరియంట్ వచ్చిందని.. కొత్త వేరియంట్‌కు విస్తృతంగా వ్యాపించే లక్షణం



ఉందని సీఎం అన్నారు. ఏపీలో కరోనా రికవరీ రేటు 99.21 శాతంగా ఉందన్నారు. జగనన్న స్మార్ట్ టౌన్ పథకం ద్వారా మధ్య తరగతికి లబ్ధి చేకూరుతుందన్నారు. సరసమైన ధరలకు లిటిగేషన్ లేని భూములు కేటాయింపులు చేస్తున్నామన్నారు. పథకం విజయవంతం చేయడానికి అధికారులు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పథకాల అమలు తీరును నిత్యం పర్యవేక్షించాలన్నారు.వ్యవసాయానికి ప్రభుత్వం అండగా ఉంటోందన్నారు. అన్ని పంటలకు కనీస మద్దతు ధర కచ్చితంగా అందాలన్నారు. తడిసిన, రంగు మారిన ధాన్యం కొనుగోలు చేయాలని సీఎం ఆదేశించారు.

# బీసీ సంఘాల ఆందోళన.. వైఎస్సార్‌సీపీ మద్దతు

ఢిల్లీ: కులాలవారీగా జనగణన చేపట్టాలంటూ ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద బీసీ సంఘాలు ఆందోళన చేపట్టాయి. ఈ ధర్నాలో తెలుగు రాష్ట్రాలకు చెందిన బీసీ సంక్షేమ సంఘాలు పాల్గొన్నాయి. కాగా ఈ ధర్నాకు వైఎస్సార్‌సీపీ ఎంపీలు మద్దతు తెలిపారు. ధర్నాలో ఎంపీలు మార్గాని భరత్, మోపిదేవి వెంకటరమణ, పిల్లి సుభాష్ చంద్రబోస్, గోరంట్ల మాధవ్, తలారి రంగయ్య హాజరయ్యారు.కాగా అనేక చిన్నచిన్న కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేసి వాటికి ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయంగా గుర్తింపు తెచ్చారన్నారని ఎంపీ మోపిదేవి వెంకటరమణ అన్నారు. బీసీలు బలహీన వర్గాలకు చెందిన వారే కానీ బలహీనులు కాదని.. బీసీలకు కేటాయించే బడ్జెట్ సరిపోవట్లేదని ఎంపీ సుభాష్ చంద్రబోస్ అన్నారు. సామాజిక వెనుకబాటు ఉన్నవారికి రిజర్వేషన్లు అందాలన్నారు. జనగణనలో కులగణన చేయాలని డిమాండ్ చేస్తున్నామని బోస్ పేర్కొన్నారు.



# ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎండీ రుహుల్లాను ఖరారు చేసిన సీఎం జగన్

విజయవాడ: అనారోగ్యంతో ఇటీవల మృతిచెందిన ఎమ్మెల్సీ మహ్మద్ కరీమున్నీసా స్థానంలో ఆమె కుమారుడు రుహుల్లాను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఖరారు చేశారు. సీఎం నిర్ణయంతో ఎమ్మెల్సీ కార్యాలయం వద్ద సంబరాలు నిర్వహించారు.ఎండీ రుహుల్లా, కార్పొరేటర్ షాహీన సుల్తానా సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఎండీ రుహుల్లా మీడియాతో మాట్లాడుతూ.. జీవిత కాలం సీఎం జగన్‌కి రుణపడి ఉంటాము. స్వర్గీయ ఎమ్మెల్సీ కరిమున్నీసా ఆశయాలను నెరవేరుస్తాం. మైనార్టీల సమస్యలు పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తానని ఎండీ రుహుల్లా అన్నారు.



# యువతలో నైతికత, దేశభక్తిని సినిమాలు పెంపొందించాలి: వెంకయ్యనాయుడు



న్యూఢిల్లీ: సినిమా రంగం లక్ష్యం వినోదం మాత్రమే కారాదని, యువతలో నీతి, నైతికవర్తన, దేశభక్తి, మానవత్వాన్ని పెంపొందించేలా సినిమాలు తీయాలని చిత్ర నిర్మాతలకు ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. ఓ ఉన్నత లక్ష్యంతో సినిమాలు నిర్మించడం ద్వారా యువతను చైతన్యవంతం చేయాలని ఉద్ఘాటించారు. సినిమా ద్వారా కులతత్వం, అవినీతి, లింగ వివక్ష, సామాజిక వివక్ష వంటి దురాచారాలపై పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రసిద్ధ దర్శకుడు రాహుల్ రావైల్ రచించిన 'రాజ్ కపూర్–ది మాస్టర్ ఎట్ వర్క్' పుస్తకాన్ని మంగళవారం న్యూఢిల్లీలోని ఇండియా హాబిటాట్ సెంటర్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు ప్రసంగించారు.భారతీయ చిత్రాలను ప్రపంచవ్యాప్తంగా వీక్షిస్తున్నారని పేర్కొన్న ఉపరాష్ట్రపతి.. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రవాస భారతీయులను సినిమా తమ మూలాలతో కలుపుతున్నదని, ఈ దిశగా సాంస్కృతిక వారధిని నిర్మిస్తున్నదని తెలిపారు.హిందీ చిత్ర సినిమా ఘనతను సగర్వంగా చాటిచెప్పిన రాజ్ కపూర్ జీవితానికి సంబంధించిన అద్భుతమైన జ్ఞాపకాలతో పుస్తకాన్ని తీసుకొచ్చిన రాహుల్ రావైల్, శ్రీమతి ప్రణికా శర్మ అభినందనీయులన్నారు. రాజ్ కపూర్ దూరదృష్టి గల మేధావి అని, బహుముఖ ప్రజ్ఞాశాలి అని పేర్కొన్నారు. భారతీయ చలనచిత్ర పరిశ్రమకు రాజ్ కపూర్ చేసిన సేవలు చిరస్మరణీయమని తెలిపారు. రాజ్ కపూర్ తన చిత్రాల ద్వారా భారతీయ సినిమాను సాంస్కృతిక దౌత్యానికి వాహకంగా మారారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సినిమా నటుడు రణ్‌బీర్ కపూర్, కాలమిస్ట్ సుహేల్ సేథ్, బ్లూమ్స్ బరీ ఇండియాకు చెందిన శ్రీమతి మీనాక్షి సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల కేటాయింపు ప్రక్రియపై స్టే ఇచ్చేందుకు నిరాకరించిన హైకోర్టు




హైదరాబాద్: నూతన జోనల్ విధానానికి అనుగుణంగా ఉద్యోగుల కేటాయింపుపై మంగళవారం హైకోర్టు విచారణ జరిపింది. ఉద్యోగుల కేటాయింపు ప్రక్రియపై స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. 226 మంది ఉపాధ్యాయుల పిటిషన్‌పై సీజే జస్టిస్ సతీష్ చంద్ర శర్మ ధర్మాసనం విచారణ జరిపింది. రాష్ట్రపతి, గతంలోని కోర్టు ఉత్తర్వులకు విరుద్ధంగా జీవోలు ఉన్నాయని పిటిషనర్ల తరఫున న్యాయవాది వాదనలు వినిపించారు. అయితే ప్రభుత్వ వాదన వినకుండా ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేమని న్యాయస్థానం పేర్కొంటూ... నాలుగు వారాల్లోగా వివరణ ఇవ్వాలని ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది.

# పీఆర్సీపై ఉద్యోగ సంఘాలతో ప్రభుత్వ సలహాదారు సజ్జల భేటీ



అమరావతి: పీఆర్సీపై ఉద్యోగ సంఘాల నేతలతో ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి మంగళవారం భేటీ అయ్యారు. ఉద్యోగ సంఘాలతో విడివిడిగా ఆయన సమావేశమయ్యారు. ఉద్యోగ సంఘాల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిని సజ్జల వివరిం చారు. సీఎం జగన్ ఎప్పుడూ ఉద్యోగుల పక్షపాతిగా ఉంటారని సజ్జల అన్నారు.ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లా డుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి న్యాయం చేస్తారనే నమ్మకం ఉద్యోగుల్లో ఉందని పేర్కొన్నారు. తమకు ఇంత కావాలని ఉద్యోగులు చెప్పడంలో తప్పు లేదని.. ఉద్యోగులు కూడా ప్రభుత్వంలో భాగమేనని సజ్జల అన్నారు. పట్టు విడుపులు అటూ ఇటూ ఉండటం కామనేనన్నారు.

పీఆర్సీపై రేపు స్పష్టతపై వచ్చే అవకాశం: వెంకట్రామిరెడ్డి

తమ డిమాండ్లను ప్రభుత్వానికి తెలిపామని సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి అన్నారు.

# తుది ఘట్టానికి చేరుకున్న మహా పాదయాత్ర

చిత్తూరు డిసెంబర్ 14 గత కొన్ని రోజులుగా అమరావతి రైతులు చేపడుతున్న మహా పాదయాత్ర తుది ఘట్టానికి చేరుకున్నది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధానిగా అమరావతిని ప్రకటించాలంటూ రాష్ట్రానికి చెందిన రైతులు గత 44 రోజులుగా పాదయాత్ర చేస్తున్నారు. ఈ యాత్ర ఇవాళ అలిపిరికి చేరుకోవడంతో ముగియనున్నది. ఇవాళ రాత్రికల్లా రైతులు తిరుమల కొండపైకి చేరి రేపు స్వామివారిని దర్శించుకోనున్నారు. రైతులు స్వామివారిని దర్శించుకునేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.తమ కోరికను సాధించుకునేందుకు 'న్యాయస్థానం టు దేవస్థానం' పేరిట అమరావతి రైతులు నవంబర్ 1 న మహా పాదయాత్ర ప్రారంభించారు.



44 రోజులపాటు కొనసాగిన ఈ యాత్రలో దాదాపు 440 కిలోమీటర్లకు పైగా నడిచారు. పాదయాత్ర గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల మీదుగా చిత్తూరులో కొనసాగింది. తిరుమల కొండకు చేరుకోవడం ద్వారా ఈ మహాపాదయాత్ర ముగుస్తుంది. యాత్ర ప్రారంభమైనప్పటి నుంచి ఎన్ని అవాంతరాలు ఎదురైనా.. విజయవంతంగా కొనసాగించారు. యాత్రలో అన్ని జిల్లాల రైతులు పాల్గొనగా.. పలు రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు మద్దతు పలికాయి. పొరుగు రాష్ట్రాల్లోని రైతులు కూడా ఈ యాత్రలో పాల్గొన్నారు.తిరుమలకు చేరిన రైతులు.. రేపు, ఎల్లుండి స్వామి వారిని దర్శించుకోనున్నారు. రైతుల దర్శనానికి టీటీడీ బోర్డు అనుమతించింది. కొవిడ్ నిబంధనలు పాటిస్తూ శ్రీవారిని దర్శించుకోవాలని టీటీడీ సూచించింది. రేపు ఒక్కరోజే దాదాపు 500 మంది రైతులకు శ్రీవారి దర్శనం కల్పించేందుకు టీటీడీ సంసిద్ధత వ్యక్తం చేసింది. తమ అమరావతి ఆకాంక్షను చాటిచెప్పేలా 17 న సమావేశం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. సభకు పోలీసులు అనుమతి నిరాకరించారు. దాంతో రైతు నాయకులు కోర్టును ఆశ్రయించారు. అవాంతరాలు ఎదురైతే తాము బస చేస్తున్న రామానాయుడు కల్యాణమండపంలోనే సభ జరిపేందుకు కూడా ఏర్పాట్లు చేస్తున్నారు.

# పాత పద్ధతిలోనే సినిమా టికెట్ల రేట్లు: ఏపీ హైకోర్టు

అమరాతి: సినిమా టికెట్ల ధరలపై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. పాత పద్ధతిలోనే టికెట్ల రేట్లు పెంచుకోవచ్చంటూ మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. గతంలో సినిమా టికెట్ల రేట్లు తగ్గిస్తూ ఏపీ ప్రభుత్వం ఇచ్చిన జీవోను హైకోర్టు నిలుపుదల చేసింది.



# సంపాదకీయం

బుధవారం 15 డిసెంబరు 2021

## యూపీలో టోపీల రాజకీయం

యూపీ సమరానికి సమయం దగ్గర పడుతోంది. పార్టీలు వ్యూహాలకు పదును పెడుతున్నాయి. ప్రకటనకు ప్రచారం హోరెత్తుతోంది. ప్రస్తుతం యూపీలో టోపీ రాజకీయం నడుస్తోంది. సమాజ్‌వాద్ పార్టీ ఎర్ర టోపీ కేంద్రంగా రాజకీయ చర్చ నడుస్తోంది. సీఎం యోగి ఆదిత్యనాథ్ అసెంబ్లీ ప్రసంగానికి ఎర్ర టోపీ ధరించిన ఎస్పీ ఎమ్మెల్యేలు అడ్డుకోవటంతో వివాదం మొదలైంది. క్యాప్ పెట్టుకున్న సమాజ్‌వాదీ పార్టీ కార్యకర్తలు గుండాలు అనే అర్థం వచ్చేలా యోగి ఎగతాళి చేయటంతో వారు సభలో అలజడి సృష్టించారు. ఇక, ఇటీవల గోరఖ్‌పూర్‌లో జరిగిన ర్యాలీలోఎర్రటోపీ వారు రాష్ట్రానికి "రెడ్ అలర్ట్" అంటూ ప్రధాని మోడీ వ్యాఖ్యానించారు. యోగీ, మోడీ ఎర్రటోపీ వ్యాఖ్యలు యదాలాపంగా చేసినవి కాదు. ఉద్దేశపూర్వకంగా చేసినవే అంటున్నారు విశ్లేషకులు. కానీ వారి వ్యాఖ్యలు పరోక్షంగా సమాజ్‌వాదీ పార్టీకి లాభించాయి. ముఖ్యమంత్రి, ప్రధాన మంత్రి వ్యాఖ్యలతో ఎర్రటోపీకి అనుకోని ప్రచారం లభించింది. దాంతో ఇప్పుడు అఖిలేష్ యాదవ్, అయన సహచరులు ఎప్పుడూ చూసినా ఎర్రటోపీతో కనిపిస్తున్నారు. ఆ పార్టీ ఎమ్మెల్యేలు రెడ్ క్యాప్ పెట్టుకుని అసెంబ్లీలో దర్శనమిస్తున్నారు. అఖిలేష్ యాద్ సోషల్ మీడియా ఖాతాల ప్రొఫైల్ పిక్చర్ కూడా మారింది. ఎర్రటోపీ పెట్టుకున్న ఫొటో కనిపిస్తోంది. ఫేస్‌బుక్, ట్విట్టర్ ప్రొఫైల్ పిక్చర్లు చూస్తే విషయం అర్థమవుతుంది. పార్టీ నాయకులు, కార్యకర్తలు కూడా ఆయననే అనుసరిస్తున్నారు. అఖిలేష్ ఏ కార్యక్రమానికి వెళ్లినా .. ఏ ర్యాలీలో పాల్గొన్నా ఎర్రటోపీ ఉండాల్సిందే. నిజానికి, గతంలో అఖిలేష్ కు ఈ టోపీని పెద్దగా ధరించేవాడు కాదు. ఐతే, తండ్రి ములాయం సింగ్ యాదవ్ సలహా మేరకు కొన్నేళ్ల నుంచి ఎక్కడికి వెళ్లినా తప్పకుండా టోపీ పెట్టుకుంటున్నారు. ఇది ఇలావుంటే, ఎస్పీ, బీజేపీ మధ్య జరుగుతున్న పోరులో ఆమ్ ఆద్మీపార్టీ కూడా చేరింది. ఆమ్ ఆద్మీ పార్టీ రాజ్యసభ ఎంపీ, యూపీ ఇన్‌ఛార్జ్ సంజయ్ సింగ్ ట్విటర్‌లో నల్లటోపీ పెట్టుకున్న మోడీ ఫొటో షేర్ చేశారు. నల్లటి టోపీ ధరించిన వారు మంచి మనసున్న వారు కాదనే అర్థంలో క్యాప్షన్ పెట్టారు. ఎర్రటోపీ వారితో జాగ్రత్తగా ఉండాలని ఉత్తరప్రదేశ్ ప్రదేశ్ ప్రజలను హెచ్చరించాలనే సందేశం యోగి, మోడీ వ్యాఖ్యలలో కనిపిస్తుంది. కానీ అది అనుకోకుండా సమాజ్‌వాదీ పార్టీకే లాభం చేకూరుస్తోంది. ఎస్పీపై దాడి చేయాలని బీజేపీ అనుకుంది..కానీ తమ వ్యాఖ్యలతో ఎర్ర టోపీకి రాష్ట్ర వ్యాప్తంగా భారీ ఎత్తున్న ఉచిత ప్రచారం వస్తుందని ఊహించలేదు. ఇప్పుడు ఎస్పీ కార్యకర్తలంతా టోపీ పెట్టుకునే కనిపిస్తున్నారు. ఆ పార్టీ ర్యాలీలు..ఇతర ప్రజా కార్యక్రమాలు..ఫ్లెక్సీలలో ఎర్ర టోపీలు ప్రత్యేకంగా కనిపిస్తున్నాయి. ఎన్నికల ముందు బీజేపీకి ఇదో పెద్ద తలనొప్పిగా మారింది. మరోవైపు, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ ప్రధాని మోడీ వాఖ్యలపై అదే స్థాయిలో స్పందిస్తున్నారు. ఎరుపు ఆధునికతకు గుర్తు.. ప్రేమతో పాటు విప్లవ చిహ్నం కూడా. రక్తం రంగు కూడా ఎరుపే. మరి మోడీ ఎందుకు ఎరుపుని చూసి కలత చెందుతున్నారని ఎగతాళి చేస్తున్నారు. ఇప్పుడు ప్రధాని మాట్లాడ వలసింది టోపీ రంగు గురించి కాదు.. దేశాన్ని పీడిస్తున్న ద్రవ్యోల్బణం ..నిరుద్యోగం వంటి ఎన్నో సమస్యలపై అంటూ తీవ్ర స్థాయిలో విమర్శిస్తున్నారు. ఇక, 2024 సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి ఉత్తరప్రదేశ్ అత్యంత కీలకం. యూపీ చేజారితే ఢిల్లీ చేయి దాటే ప్రమాదం ఉంది. అందుకే, మోడీ సర్కార్ సాగు చట్టాలను కూడా వెనక్కి తీసుకుంది. జాట్ ఓట్ల కోసమే బీజేపీ ఆ పనిచేసిందనేది బహిరంగ రహస్యం. పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లో జాట్లదే ఆధిపత్యం. రాష్ట్రీయ జనతాదళ్‌కు ఈ ప్రాంతంలో మంచి పట్టుంది. అది ఇప్పుడు సమాజ్‌వాదీ పార్టీతో కలిసి ఎన్నికలకు వెళుతోంది. ఇది బీజేపీకి ఆందోళన కలిగిస్తోంది. యూపీ రాజకీయాలలో చర్చనీయాంశంగా మారిన ఎర్రటోపీ కథ ఏమిటో ఓసారి చూద్దాం. ములాయం సింగ్ పార్టీని స్థాపించనప్పుడు ఎర్రటోపీ లేదు. కొంత మంది గాంధీ టోపీ పెట్టుకునేవారు. ఐతే, సమాజ్‌వాదీ పార్టీ తొలి యువజన సభలకు ఎర్రటోపీ పెట్టుకుని రావాలని ములాయం పిలుపునిచ్చారు. ఐతే, ఆ పార్టీ నాయకులు వాటిని అధికారికంగా ధరించింది 2002లో కాన్పూర్ సమావేశంలో. అప్పుడు నలుగురు ఐదుగురు పార్టీ నేతలు ఎర్రటోపీతో కనిపించారు. 2012లో అఖిలేష్ అధికారం చేపట్టిన తరువాత ఈ సంస్కృతి పెరిగింది. పార్టీ ఎమ్మెల్యేలు ఎర్రటోపీ పెట్టుకుని అసెంబ్లీ రావటం ప్రారంభమంది. రాష్ట్రంలో బీజేపీ కాషాయ రంగు ఆధిపత్యం పెరిగటంతో ..దానికి ప్రత్యామ్నాయంగా ఎరుపును బలంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని అఖిలేష్ భావించారు. ఆ పార్టీ జెండాలో కూడా ఎరుపు ఉంది. దాంతో ఆయన ఎర్రటోపీపై ఫోకస్ పెంచాడు. నిజానికి భారత రాజకీయాలలో టోపీ సంస్కృతి కొత్త కాదు. కాంగ్రెస్ పార్టీ ట్రేడ్ మార్క్ గాంధీ టోపీ. మహాత్ముడే దీనిని ప్రాచుర్యంలోకి తెచ్చారు. అందుకే గాంధీ టోపీ అంటారు. స్వాంత్రంత్ర్యం వచ్చిన తరువాత కూడా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు ఈ టోపీ డ్రెస్‌కోడ్‌గా మారింది. 1918-1921 మధ్య సహాయ నిరాకరణ సమయంలో గాంధీ టోపీకి విశేష ప్రాచుర్యం లభించింది. స్వాభిమానం, స్వావలంబన, సంఘీభావానికి గుర్తుగా గాంధీ టోపీ మారిపోయింది. దాంతో ఒక దశలో బ్రిటిష్ ప్రభుత్వం దానిని నిషేధించాలని కూడా చూసింది. వాస్తవానికి, ఈ టోపీ సంస్కృతిని గాంధీ దక్షిణాఫ్రికా నుంచి దిగుమతి చేశారని చెబుతారు. అక్కడ జైలులో ఉన్నప్పుడు ఈ టోపీ ధరించాల్సి వచ్చింది. అదే గాంధీ టోపీ పుట్టుకకు ఊపిరిపోసింది అనే వాదన ప్రాచుర్యంలో ఉంది. మరోవైపు, గాంధీ టోపీ పుట్టుక రాంపూర్ సంస్థానంలో జరిగిందని కొందరు వాదిస్తారు. మహాత్మా గాంధీ 1920లో రాంపూర్ సంస్థానాన్ని సందర్శించారు. ఓ వివాహానికి హాజరయ్యేందుకు వెళ్లిన గాంధీ.. తరువాత రాంపూర్ నవాబును కలవాలనుకున్నారు. ఐతే, నవాబు ఆస్థానంలోకి తలపాగ ధరించి వెళ్లటం సంప్రదాయం. కానీ గాంధీజీకి తలపాగా లేకపోవటంతో.. ఖిలాఫత్ ఉద్యమ నేత మహ్మద్ అలీ జౌహార తల్లి అబాదీ బేగం అప్పటికప్పుడు గారా ముతక బట్టతో టోపీ తయారుచేసి ఇచ్చిందని చెబుతారు. మరోవైపు, సబర్మతి, వార్ధాలో గాంధీ టోపీ మూలాలు ఉన్నాయని చాలా మంది అనుకుంటారు. కానీ దేనికి నిర్థిష్టమైన ఆధారాలు లేవు. ఇప్పటికీ భారత రాజకీయాలలో గాంధీ టోపీకి ప్రాధాన్యత ఉంది. సామాజిక కార్యకర్త అన్నా హజారే గాంధీ టోపీ ధరించి ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద అవినీతిపై పోరాటం చేశాడు. మహారాష్ట్రలో నేతలతో పాటు రైతులు కూడా గాంధీ టోపీ పెట్టుకునే పనులకు వెళతారు. అరవింద్ కేజ్రీవాల్ ఆమ్ ఆద్మీ పార్టీకి గాంధీ టోపీ ప్రత్యేకత తెచ్చి పెట్టింది. ఆ పార్టీ కార్యకర్తలు తరచూ టోపీ ధరించి కనిపిస్తారు. ఆరెస్సెస్‌లో కూడా ఈ కల్చర్ ఉంది.

# కర్నూలులో మళ్లీ రాజకీయ చిచ్చు

కర్నూలు, డిసెంబర్ 14, (న్యూస్ పల్స్)కర్నూలు జిల్లాలో అధికార పార్టీ వైసీపీ ? తెలుగు దేశం నేతల మధ్య మరోసారి రాజకీయ చిచ్చు రాజుకుంది. మంత్రాలయం టీడీపీ ఇంచార్జ్ తిక్కారెడ్డిపై దాడికి యత్నం చిలికి చిలికి గాలివానగా మారుతోంది. ఇరు పార్టీల నేతల విమర్శలు ప్రతి విమర్శలతో హోరెత్తుతోంది. తనపై జరిగిన హత్యాయత్నంపై కచ్చితంగా కేసునమోదు చేయాల్సిందేనని తిక్కారెడ్డి పట్టుబడుతున్నారు. ఇందులో భాగంగానే తిక్కా రెడ్డి సహా ఆ పార్టీ ముఖ్య నేతలంతా జిల్లా ఎస్పీ సుధీర్ కుమార్ రెడ్డిని కలిసి భద్రత పెంచాలని కోరారు. తిక్కారెడ్డిపై జరిగిన హత్యాయత్నంపై కేసు నమోదు చేసి తగిన విచారణ జరిపించాలని ఫిర్యాదు చేశారు. దీనిపై జిల్లా ఎస్పీ సానుకూలంగా స్పందించారని టీడీపీ నేతలు తెలిపారు. అయితే, ఇప్పటివరకు తనపై మూడు సార్లు దాడి జరిగినట్లు తిక్కా రెడ్డి చెప్తున్నారు. ఒక పథకం ప్రకారమే జరుగుతున్న ఈ విషయంపై తనకు ఏమి జరిగినా ప్రభుత్వం బాధ్యత వహించాలని తిక్కా రెడ్డి డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు వైసీపీ నేతలు కూడా తీవ్రంగా స్పందించారు. తనకు సెక్యూరిటీ కోసమే జరగని విషయాన్ని జరిగినట్లు సృష్టించి తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఆరోపించారు. ఫ్యాక్షన్ గ్రామము పెద్ద బొంపల్లి జాతర సందర్భంగా ఇతరులెవరూ వెళ్లరాదని గ్రామస్తులు నిర్ణయించుకున్నప్పటికీ తిక్కా రెడ్డి వెళ్లడం తోనే ఉద్రిక్తత ఏర్పడిందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఇంత చిన్న విషయానికి చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ స్పందించి లేని ఉద్రిక్తతలకు కారణమవుతున్నాయని ఏకంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నిందించడం ఏంటి అని నిలదీశారు. ఒక్క పెద్ద బొంపల్లి లోనే కాకుండా మంత్రాలయం నియోజకవర్గంలోని అనేక గ్రామాలలో తరచుగా ఘర్షణలు జరుగుతుండటంపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, టీడీపీ నియోజకవర్గ ఇంచార్జి తిక్కారెడ్డి మధ్య చాలా కాలంగా పోటీ నెలకొంది. ఇటీవలి సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే స్థానానికి పోటీ చేసిన తిక్కారెడ్డి నియోజకవర్గం ఖగ్గల్‌లో ప్రచారం నిర్వహిస్తుండగా గాయపడ్డారు. ఆయనతో పాటు ఏఎస్సై వేణుగోపాల్ కాలుకు గాయమైంది. వైసీపీ నేతలు దాడి చేశారని టీడీపీ వర్గీయులు ఆరోపించాయి. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి కుమారుడు ప్రదీప్ రెడ్డి, ఇతరులు అడ్డుకున్నారు. రెండు వర్గాలు వాగ్వాదానికి దిగాయి. తోపులాట జరిగింది. పరిస్థితి అదుపు తప్పడంతో తిక్కారెడ్డికి చెందిన గన్ మెన్లు గాల్లోకి కాల్పులు జరిపారు. ఆ తర్వాత తిక్కారెడ్డి కాలికి గాయం అయ్యింది. ఈ విషయంపై పోలీసులు ఇంతవరకు కేసు నమోదు చేయకపోవడంతో తెలుగు దేశం పార్టీ నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా, నియోజకవర్గంలో ఇరువర్గాల మధ్య అడపా దడపా ఘర్షలు చోటుచేసుకుంటుండంతో మరోసారి, తనపై దాడి జరిగే అవకాశముందని, తనకు భద్రత కల్పించాలంటూ తిక్కారెడ్డి జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

# ఎట్టకేలకు టిడ్కో ఇళ్లు

రాజమండ్రి డిసెంబర్ 14, (న్యూస్ పల్స్)టిడ్కో గృహాల పంపిణీకి ప్రభుత్వం కసరత్తు ప్రారంభిం చింది. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న 2,62,216 గృహాల్లో దశలవారీగా లబ్ధిదారు లకు పంపిణీ చేసేందుకు అధికారయంత్రాంగం సిద్దమవుతోంది. 2022 మార్చి నాటికి 1.30లక్షల గృహాలను లబ్ధిదారులకు పంపిణీ చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ధేశించుకుంది. ఇందులో తొలి విడతగా సుమారు 40వేల గృహాలను డిసెంబరు చివరి నాటికి లబ్దిదారులకు అందించేందుకు కావాల్సిన ఏర్పాట్లను సిద్ధం చేయాలని ప్రభుత్వం ఇప్పటికే అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. తొలి విడతగా పంపిణీ చేయాలని భావిస్తున్న వాటిలో నెల్లూరులో 13వేల గృహాలు, కర్నూలులో 6వేలు, పశ్చిమగోదావరిలో 5వేలు, తూర్పుగోదావరిలో 6వేలు, గుంటూరులో మరో 6వేల గృహాలను పంపిణీకి సిద్ధం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. రెండో విడతలో మార్చిలో మరో 80వేల గృహాలను పంపిణీకి సిద్ధం చేసే యోచనలో ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. పంపిణీ చేయాలనుకునే గృహాలకు సంబంధించి మౌలిక వసతులు, విద్యుత్తు, మంచినీటి సౌకర్యం, రహదారులతో పాటు కనీస సౌకర్యాలు కల్పించేందుకు పంచాయతీరాజ్, మున్సిపల్‌శాఖ, రెవెన్యూశాఖలతో టిడ్కో అధికారులు సమన్వయం చేసుకుంటున్నారు. టిడ్కో ఇళ్లకు బ్యాంకర్లు మార్టిగేజ్ మెలిక పెడుతుండటంతో అధికారులు ఎలా ఈ సమస్యను అధిగమించాలో తెలియక సతమతమవుతున్నారు. బ్యాంకర్లు గృహాలకు రుణ సదుపాయం కల్పించాలంటే ఆ ఇంటికి సంబంధించిన ఆస్తి ఆన్‌లైన్‌లో నమోదై ఉండాలి. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ పత్రాన్ని పొంది ఉండాలనేది బ్యాంకర్ల నిబంధన. ఇది ఇలా ఉంటే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో గంప గుత్తగా స్వల్ప కాలంలో రిజిస్ట్రేషన్స్ చేసేందుకు సాఫ్ట్‌వేర్ సహకరించదని, దీంతో పాటు ప్రభుత్వానికి ఆదాయం వచ్చే అనేక రిజిస్ట్రేషన్లు రొటీన్‌గా ఉంటున్నాయని సబ్ రిజిస్ట్రార్లు పేర్కొంటున్నారు.

ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సబ్ రిజిస్ట్రార్ అధికారాలను గ్రామ సచివాలయ అడ్మిన్‌కు బదలాయించి వారి ద్వారా మ్యాన్యువల్ రిజిస్ట్రేషన్లు చేసి లబ్ధిదారులకు డాక్యుమెంట్లు ఇవ్వాలని భావిస్తోంది. ఇళ్లకు మార్టిగేజ్‌ద్వారా రుణాలివ్వాలంటే తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో ఆ ఇంటికి సంబంధించిన రిజిస్ట్రేషన్ పూర్తయితేనే సాధ్యమవుతుందని లేని పక్షంలో రుణాలివ్వలేమని బ్యాంకర్లు చెబుతుండటంతో ప్రభుత్వం ఇబ్బంది పడింది. బ్యాంకర్లు పెడుతున్న మెలికను దృష్టిలో పెట్టుకుని సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం జరిగిన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బిసి) సమావేశంలో టిడ్కో ఇళ్లకు బ్యాంకులు చొరవ చూపి రుణాలు మంజూరు చేస్తే సమస్య పరిష్కారమవుతుందని బ్యాంకర్లను కోరారు. వారినుండి నిర్దిష్ట హామీ ఏమీ లభించిన దాఖలాల్లేవు.

# బందరు పోర్టుకుఅడ్డంకులు

విజయవాడ, డిసెంబర్ 14, (న్యూస్ పల్స్)మచిలీపట్నం పోర్టు నిర్మాణానికి ల్యాండ్ పూలింగ్ (భూ సమీకరణ) పద్ధతిలో భూము లిచ్చిన రైతుల కు గత నాలుగేళ్లుగా కౌలు చెల్లింపులు జరగడం లేదు. మొదటి రెండేళ్లు మాత్రమే కౌలు చెల్లించిన ప్రభుత్వం ఆ తర్వాత చెల్లింపులను నిలిపివేసింది. 2015 ఆగస్టు 29న రాష్ట్ర ప్రభుత్వం మచిలీపట్నం పోర్టు నిర్మాణానికి అవసరమైన భూములను భూ సేకరణ, భూ సమీకరణ (పూలింగ్) పద్ధతుల్లో సేకరించేందుకు నోటిఫికేషన్ జారీ చేసింది. మంగినపూడి, తపిశపూడి, కరగ్రహారం, గోపువానిపాలెంలో ఎకరానికి రూ.25 లక్షల చొప్పున చెల్లించి 600 ఎకరాలను కొనుగోలు చేసింది. పూలింగ్ పద్ధతిలో భూములిచ్చిన రైతులకు ఎకరానికి 1000 గజాలు అభివృద్ధి చేసిన భూములు, 250 కమర్షియల్ ప్లాట్లు ఇస్తామని నోటిఫికేషన్లో ప్రభుత్వం పేర్కొంది. పూలింగ్‌లో ఇచ్చిన భూములను రైతులకు అంగీకారం అయ్యేలా అభివృద్ధి చేసి ఇచ్చే వరకు లేదా 30 ఏళ్లపాటు ఎకరానికి రూ.30 వేల చొప్పున కౌలు చెల్లిస్తామని ప్రకటించింది. దీంతో మంగినపూడి, తపిశపూడి, కరగ్రహారం, గోపువానిపాలెం గ్రామాలకు చెందిన 350 మంది రైతులు పూలింగ్ పద్ధతిలో 412 ఎకరాలను ఇచ్చారు. ఒప్పందం మేరకు ఈ రైతులకు 2016, 2017 సంవత్సరాల్లో నిర్దేశించిన మొత్తం కౌలును ప్రభుత్వం చెల్లించింది. అయితే ఆ తర్వాత నుంచి కౌలు చెల్లించలేదు. దీంతో రైతులకు ప్రభుత్వం మొత్తం రూ. 4 కోట్ల 94 లక్షల 40 వేల రూపాయల మేర కౌలు చెల్లింపులు బకాయి పడింది. పోర్టు నిర్మాణం, అనుబంధ పరిశ్రమల ఏర్పాటుకు గత టిడిపి ప్రభుత్వం బందరు రూరల్ మండలంలో 32 వేల ఎకరాలు సేకరిస్తామని ప్రకటించింది. ఈ భూములకు నోటిఫికేషన్ విడుదల చేయడంతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. దీనికి వ్యతిరేకంగా సుదీర్ఘకాలం పాటు పెద్దఎత్తున ప్రజా ఉద్యమం సాగింది. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిదశలో 3,762 ఎకరాల్లో పోర్టు నిర్మాణానికి ప్రణాళిక రూపొందింది. ప్రభుత్వ భూములు, భూ సేకరణ, సమీకరణలో సేకరించిన భూములు 2,328 ఎకరాలు అందుబాటులో ఉన్నాయి. మరో 1434 ఎకరాలు సేకరించాలి. రెండున్నరేళ్లలో ఈ భూముల సేకరణకు ప్రభుత్వం నిధులు కేటాయించలేదు. దీంతో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు.

# రాజోలులో జనసేనకు మద్దతుగా వైసీపీ




కాకినాడ, డిసెంబర్ 14,(న్యూస్ పల్స్)నాడు ఓట్లు వేయించి గెలిపించిన పార్టీ కార్యకర్తలు నేడు ఈ ఎమ్మెల్యే మాకొద్దు బాబోయ్ అంటున్నారు. పార్టీ మారిపోయానని చెప్పి రెండేళ్లుగా ఎమ్మెల్యే దూరంగా ఉంటున్నారు. గెలిపించిన పార్టీ కార్యకర్తలు మాత్రం ఫ్లెక్సీల మీద ఫ్లెక్సీలు పెట్టి మరీ ఆ ఎమ్మెల్యేను వెంటాడుతునే ఉన్నారట. అవకాశం వచ్చినప్పుడల్లా ఎమ్మెల్యేకు నిద్ర లేకుండా చేస్తున్నారట. ఇదంతా అధికార పార్టీ నేతే వెనకుండి నడిపిస్తున్నారని తెలిసి.. సొంతపార్టీ వాళ్లే తలలు పట్టుకుంటున్నారటజిల్లా రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్‌ను జనసేన కార్యకర్తలు వదిలి పెట్టడం లేదు. జనసేన ఎమ్మెల్యేగా గెలిచిన రాపాక.. తాను వైసీపీ ఎమ్మెల్యేనని ప్రకటించుకుని అధికారపార్టీ నేతగానే కొనసాగుతున్నారు. రాపాక తీసుకున్న ఈ నిర్ణయాన్ని జనసేన కార్యకర్తలు ఇప్పటికీ జీర్ణించుకోలేని పరిస్థితి ఉంది. రాష్ట్రంలో జనసేన నుంచి ఏకైక ఎమ్మెల్యేగా గెలిపించామనే ఆనందాన్ని మిగల్చకుండా రాపాక వైసీపీలోకి వెళ్లడంపై గుర్రుగా ఉన్నారు. అప్పటి నుంచి ఎమ్మెల్యేను ఇరకాట పెట్టడమే ధ్యేయంగా కక్షతో పని చేస్తున్నారట. స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలను గెలుచుకుని జనసేన సత్తా చాటింది. ఇటీవల ఉపఎన్నిక జరిగిన మల్కిపురం మండలంలోని రెండు ఎంపీటీసీలను జనసేనే గెల్చుకుంది. గ్లాస్ గుర్తుపై ఎమ్మెల్యేగా గెలిచిన రాపాక ఫ్యాన్ గుర్తుకిందకు వెళ్లినా.. రాజోలులో జనసేన బలం తగ్గలేదని నిరూపించారు. ఎమ్మెల్యే రాపాకను ఇరకాటంలో పెట్టేలా బాణాలు వదులుతున్నారు. అవకాశం వస్తే ఆరోపణలు.. అనుచిత కామెంట్స్‌తో విరుచుకు పడుతున్నారు జనసైనికులుతాజాగా రాజోలు మండలం కాత్రేనిపాడులో ఎమ్మెల్యే రాపాక గో బ్యాక్ అంటూ జనసైనికులు ఫ్లెక్సీ పెట్టడం దుమారం రేపింది. మా ఓట్లతో గెలిచి పార్టీకి.. మాకు ఎందుకు ద్రోహం చేశారంటూ కాత్రేనిపాడులో ఎమ్మెల్యేను నిలదీయాలనుకున్నారు. అయితే జనసేన కార్యకర్తలతో పోలీసుల చర్చలు జరపడంతో నిరసన కార్యక్రమాన్ని జనసేన శ్రేణులు విరమించుకున్నాయి. జనసేన ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించారు పోలీసులు. రాపాకను జనసేన తరఫున గెలిపించేందుకు శ్రమించిన తమకు అన్యాయం జరిగిందని చెబుతూ.. శాంతియుత నిరసన చేపడితే పోలీసులు అడ్డుకోవడంపై పార్టీ కేడర్ అసహనం వ్యక్తం చేసిందట. పోలీసులను అడ్డుపెట్టుకుని ఎమ్మెల్యే తప్పించుకుంటున్నారని జనసైనికులు గుర్రుగా ఉన్నారు. ఇకపై రాజోలు నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఎక్కడికెళ్లినా చేదు అనుభవాలు ఎదురయ్యేలా కార్యక్రమాలు చేయాలని జనసేన కార్యకర్తలు కంకణం కట్టుకున్నారట. జనసైనికులను కట్టడి చేయడానికి ఎమ్మెల్యే రాపాక కేసులు పెట్టించడంతో విభేదాలు తారాస్థాయికి చేరినట్టు సమాచారం. ఇక్కడ ట్విస్ట్ ఏంటంటే.. జనసైనికులు ఇంతలా రెచ్చిపోవడానికి కారణం ఓ వైసీపీ నేత అండదండలేనట. కోఆర్డినేటర్‌గా అన్‌ఫిట్ అని పదవి నుంచి తొలగించి.. ఆ నేతకు కార్పొరేషన్ ఛైర్మన్ పదవి కట్టబెట్టారు. అయినప్పటికీ ఆ నాయకుడికి రాజోలు కోఆర్డినేటర్ పదవిపై వ్యామోహం పోలేదట. రాపాకకు వైసీపీ పగ్గాలు పూర్తిగా అప్పగించడంతో జీర్ణించుకోలేక ఆ అధికారపార్టీ నేతే ఇదంతా నడిపిస్తున్నారని రాజోలులో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇదే విషయాన్ని రాపాక వర్గీయులు అధిష్ఠానానికి ఫిర్యాదు చేశారట. వైసీపీ అభ్యర్థిగా రెండుసార్లు ఓడిన ఆ నేతే ఇప్పుడు జనసేనవైపు తొంగి చూస్తున్నారట. వైసీపీలో కొనసాగుతూనే జనసేన పార్టీకి బాటలు వేస్తున్నారట. ఇలా చేయడం వల్ల తన ప్రత్యర్థిని ముప్పుతిప్పలు పెట్టడం ఒకటైతే రాబోయే రోజుల్లో పక్క పార్టీలో సీట్ రిజర్వ్ చేసుకోవడం ఇంకొటట. అందుకే సైలెంట్‌గా కానిచేస్తున్నట్టు టాక్. ఈ విషయం తెలిసి అధికారపార్టీ నేతలు తలపట్టుకుంటున్నారట. ఎమ్మెల్యే.. జనసేన నేతల మధ్య నెలకొన్న విభేదాలతో రానున్న రోజుల్లో ఏం జరుగుతుందో చూడాలి.

# మళ్లీ ముగ్గురు కలిస్తే... త్రెట్

విజయవాడ, డిసెంబర్ 14, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు ఎన్నికలకు మూడేళ్ల ముందే హీటెక్కాయని చెప్పాలి. ప్రస్తుతమున్న పరిస్థితులను చూస్తుంటే ఈసారి జగన్ ఒంటరిగా ముగ్గురు రాజకీయ శత్రువులను ఎదుర్కొనాల్సి ఉంటుంది. 2014 సీన్ రిపీట్ అయ్యే అవకాశాలు ఎక్కువగా కన్పిస్తున్నాయి. అదే ఫలితాలు రిపీట్ అవుతాయా? అన్నది పక్కన పెడితే ఈసారి జగన్ కు 2019 ఎన్నికల్లో సాఫీగా సాగిన ప్రయాణం ఈసారి ఉండదనే చెప్పాలి.. 2014లో బీజేపీ, జనసేన, టీడీపీ లు కలసి పోటీ చేసే అవకాశాలు ఎక్కువగా కన్పిస్తున్నాయి. బీజేపీ టీడీపీతో పొత్తు పెట్టుకోమని కొందరు నేతలు చెబుతున్నా పవన్ కల్యాణ్ చివరి నిమిషంలో బీజేపీ పెద్దలను ఒప్పిస్తారన్న నమ్మకం అయితే ఉంది. జనసేన లేకుండా బీజేపీ ఒంటరిగా పోటీ చేసే అవకాశాలు లేవు. అలా పోటీ చేసి 2019 ఎన్నికల్లో నోటా కంటే తక్కువ ఓట్లను తెచ్చుకుంది. మరోసారి చేయి కాల్చుకునే అవకాశమయితే లేదు. ఇక జనసేన కూడా బీజేపీతో కలసి వెళితే జోగి జోగి రాసుకుంటే అన్న సామెత గుర్తుకు రాక మానదు. అందుకే మూడు పార్టీలు కలసి పోటీ చేసి జగన్ ను దెబ్బతీయాలన్న ఆలోచనలో పవన్ ఉన్నారు. ఖచ్చితంగా అదే జరుగుతుందని జనసేన అగ్రనేతలు ఆఫ్ ది రికార్డులో చెబుతున్నారు. దీంతో జగన్ మరోసారి ఒంటరిగా మూడు పార్టీలను ఎదుర్కొనాల్సి ఉంటుంది. అయితే జగన్ 2014లో మాదరికాదు. ఇప్పుడు చాలా రాటుదేలి ఉన్నారు. కులాలే శాసించనున్న... సంక్షేమ పథకాలే తనను గట్టెక్కిస్తాయని నమ్మకంతో ఉన్నారు. పవన్, చంద్రబాబు, బీజేపీ కలిస్తే కాపు ఓటు బ్యాంకు కొంత దెబ్బతింటుందన్నది జగన్ కు తెలుసు. అందుకే అధికారంలోకి వచ్చిన నాటి నుంచి బీసీ ఓటు బ్యాంకుపై జగన్ గురి పెట్టారు. చంద్రబాబు నాయకత్వంపై నమ్మకం లేదు. పవన్ ను విశ్వసించడం కష్టం. రాష్ట్రానికి అన్యాయం చేసిన బీజేపీ పై ఏపీ ప్రజలు గుర్రుగా ఉన్నారు. కానీ మార్పు కోరుకోవడానికి కూడా అవకాశాలున్నాయి. కులాలే గెలుపును తెచ్చి పెట్టే ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఈసారి జగన్ కు కొంత ప్రతి కూలత తప్పదన్న విశ్లేషణలు వినపడుతున్నాయి.

# రఘురామ గుస్సా

హైదరాబాద్, డిసెంబర్ 14, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, జగన్ రెడ్డి పాలనపై మరోసారి తీవ్ర వ్యాఖ్యలు చేశారు నర్సాపురం ఎంపీ రఘురామ కృష్ణం రాజు. వైసీపీ పాలనలో ఆంధ్రప్రదేశ్ పరిస్థితి అత్యంత దారుణంగా తయారైందని అన్నారు. 377 నిబంధన కింద లోకసభలో లిఖితపూర్వకంగా ఆయన నివేదించారు. ఏపీలో ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్థంగా మారిందన్నారు. రుణాల కోసం ప్రభుత్వ ఆస్తులను తాకట్టు పెడుతున్నారని రఘురామ ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు కూడా చెల్లించలేని పరిస్థితుల్లో ఏపీ ప్రభుత్వం ఉందన్నారు. కార్పొరేషన్ల పేరుతో దొడ్డిదారిన రుణాలు తీసుకుంటున్నారని విమర్శించారు. ఆర్థిక దివాళా పరిస్థితుల్లో ఏపీలో రాష్ట్రపతి పాలన అనివార్యమని వ్యాఖ్యానించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన పెట్టాలని ఎంపీ రఘురామకృష్ణంరాజు లోక్‌సభలో కేంద్రాన్ని కోరారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి లక్ష్మి నారాయణ ఇంటిపై సీఐడీ పోలీసుల సోదాలు, కేసుల నమోదు కక్ష్య సాధింపు మాత్రమేనని ఎంపీ రఘురామకృష్ణం రాజు అన్నారు. లక్ష్మీ నారాయణ ఇంట్లో సోదాలు జరుగుతున్న విషయం తెలుసుకున్న ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఎండీ వేమూరి రాధాకృష్ణ ఆయన నివాసానికి వెళ్లారు. ఆ సమయంలో పోలీసులు ఆర్కేను ఉండమని చెప్పిన విషయం వీడియోలో స్పష్టంగా కనిపిస్తోందన్నారు. తిరిగి రాధాకృష్ణపై జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేయడం కూడా కక్ష్య సాధింపేనన్నారు ఎంపీ రఘురామ కృష్ణం రాజు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పోలీసులను దారుణంగా వాడుకుంటోందని రఘురామ విమర్శించారు. రోజులు ఎప్పుడూ ఒకేలా ఉండవనే విషయం పోలీసులు గుర్తు పెట్టుకోవాలన్నారు. తప్పులు చేసే పోలీసులు కూడా శిక్షలకు సిద్ధంగా ఉండాలన్నారు. రిటైర్డ్ జడ్జి చంద్రుడు రాష్ట్ర ప్రభుత్వానికి మరో అంబాసిడర్‌గా తయారయ్యారన్నారు. న్యాయ వ్యవస్థను నిర్వీర్యం చేసేలా చంద్రుడు మాట్లాడారని, ఆయన వ్యవహారంపై హైకోర్టు, సుప్రీంకోర్టుకు లేఖ రాస్తానన్నారు. పవన్ కళ్యాణ్ చెప్పినట్లుగా ఏపీ ప్రభుత్వం అందరికీ హనీ చేస్తోందని రఘురామ రాజు అన్నారు.

# జగన్ కు సింపతి కోసం యత్నాలు

విజయవాడ, డిసెంబర్ 14, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కు ప్రాణహాని ఉందా? ఆయనను ఎవరు టార్గెట్ చేశారు? ఇదీ ప్రస్తుతం ఏపీ రాజకీయాల్లో హాట్ టాపిక్. ముఖ్యమంత్రి జగన్ కు ప్రాణహాని ఉందని, ఆయనను హత్య చేయడానికి కుట్ర జరుగుతుందంటూ వైసీపీ నేతలే ఆరోపిస్తున్నారు. మంత్రి నారాయణ స్వామి, ఎమ్మెల్యే తోపుదర్తి ప్రకాష్ రెడ్డిలు ఈ కామెంట్స్ చేయడంతో ఏపీ రాజకీయాల్లో మరోసారి కాక రేపాయి. జగన్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి టీడీపీ నేతలను టార్గెట్ చేశారు. వారి ఆర్థిక మూలాలను దెబ్బతీసే పనిలోనే ఉన్నారు. టీడీపీని పూర్తిగా బలహీనం చేసేందుకు జగన్ ప్రయత్నిస్తున్నారు. అదే జగన్ కు ఇబ్బందిగా మారిందన్నది వైసీపీ నేతల ఆరోపణ, మొన్నామధ్య తిరుపతిలో చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను కూడా వైసీపీ నేతలు ఉటంకిస్తున్నారు. గాల్లోనే జగన్ కలసి పోతాడని చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు దీనికి చుదుతున్నారు. జగన్ ఉంటే ఇక తాము అధికారంలోకి రాలేమని భావించిన టీడీపీ అధినేత చంద్రబాబు జగన్ హత్యకు కుట్రపన్నారని మంత్రి నారాయణస్వామి తీవ్ర స్థాయిలోనే ఆరోపణలు చేశారు. అందుకే జగన్ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. లేకుంటే చంద్రబాబు ఏదైనా చేయగలిగిన సమర్థుడని, రాజకీయం కోసం ఆయన గతంలో చేసిన హత్యారాజకీయాలను కూడా వారు ప్రస్తావించారు. దీనిపై టీడీపీ నేతలు తీవ్రస్థాయిలో అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతమున్న సమస్యల నుంచి ప్రజలను పక్కదోవ పట్టించేందుకు ఈ కామెంట్స్ ను వైసీపీ నేతలు చేస్తున్నారన్నారు. మరో కోడికత్తి, బాబాయ్ గొడ్డలి వేటు డ్రామాకు వై?సీపీ తెరలేపిందని సీనియర్ నేత అయ్యన్న పాత్రుడు అన్నారు. మళ్లీ కోడికత్తికి, గొడ్డలికి సాన పెడుతన్నట్లుందని అనుమానం వ్యక్తం చేశారు. బాబాయ్ ని చంపిందెవరో చెప్పకుండా ఈ డ్రామాలు కట్టిపెట్టాలని ఆయన కోరారు. మొత్తం మీద జగన్ ను బతకనివ్వరంటూ వైసీపీ నేతలు చేస్తున్న కామెంట్స్ మరోసారి ఏపీ రాజకీయాల్లో దుమారం రేపుతున్నాయి.

# మాకు మూడు రాజధానులే ముద్దు

**పాదయాత్రకు స్వాగతం పలికిన ఫ్లెక్స్**




తిరుపతి అమరావతి మాత్రవే రాజధానిగా వుండాలంటూ చేస్తున్న పాదయాత్రకు తిరుపతిలో అనుకోని స్వాగతం లభించింది. మాకు మూడు రాజధానులకే ముద్దు అంటూ ఫ్లెక్స్ లు వారికి స్వాగతం పలికాయి. మీతో మాకు గొడవలు వద్దు... మీకు మా స్వాగతం అంటూ.. తిరుపతి లో పలు కూడళ్ళలో ఫ్లెక్స్ ల ఏర్పాటు చేసారు. మంగళవారం నాడు ఉదయం తిరుపతి పట్టణంలోకి రాజధాని రైతుల పాదయాత్ర ప్రవేశించింది. ఈ కార్యక్రమానికి ప్రజలు, అమరావతీ రాజధాని మద్దతు దారులు భారీగా హజరయ్యారు.

# దొంగతనాలు అరికట్టాలంటే అప్రమత్తతే మార్గం



ఏలూరు పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు ఒకటో పట్టణ పరిధిలో పనిచేస్తున్న మహిళా సంరక్షణ కార్యదర్శులు, ఒకటో పట్టణ సీఐ ఆది ప్రసాద్ ప్రజలకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. దొంగతనాలను నివారించాలంటే అప్రమత్తతే మార్గమని చెప్పారు ఊళ్లకు వెళ్ళేవారు తమకు సమాచారం ఇస్తే వారి ఇళ్లకు ఎల్ హెచ్ ఎం ఎస్ యాప్ ద్వారా పోలీసులు రక్షణ కల్పిస్తామని అన్నారు. చెడ్డి గ్యాంగ్ పై ఆందోళన వద్దని అన్నారు. మహిళా సంరక్షణ కార్యదర్శులు ఇంటింటికి తిరిగి ఈ అవగాహన కల్పించారు.

# ఇంధన పొదుపు వారోత్సవాల సందర్భంగా ర్యాలీ

**డిసెంబర్ 14 నుంచి 20 వరకు ఇంధన పొదుపు వారోత్సవాలు**

విజయవాడ, డిసెంబర్ 14: ఇంధన పొదుపు వారోత్సవాల సందర్భంగా ర్యాలీ ని ఇంధన శాఖ కార్యదర్శి నాగులపల్లి శ్రీకాంత్, జిల్లా కలెక్టర్ జె.నివాస్ ప్రారంభించారు. డిసెంబర్ 14 నుంచి 20 వరకు ఇంధన పొదుపు వారోత్సవాలు జరగనున్నాయి. కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి ఇందిరా గాంధీ మునిసిపల్ స్టేడియం వరకు ఇంధన పొదుపు పై నిర్వహించిన అవగాహన ర్యాలీలో వియంసి కమిషనర్ వి. ప్రసన్న వెంకటేష్,జాయింట్ కలెక్టర్ కె.మోహన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఇంధనశాఖ కార్యదర్శి ఎన్.శ్రీకాంత్ మాట్లాడుతూ రాష్ట్రంలో రూ.3,800 కోట్ల విలువైన 5,600 మిలియన్ యూనిట్ల ఇంధన అదా అయింది. మహోద్యమంగా విద్యుత్ పొదుపు ను తీర్చిదిద్దుతామని అన్నారు. ఈ సందర్భంగా అయన ఇంధన పొదుపు పై అవగాహన కలిగించే పోస్టర్లు, కరపత్రాలు విడుదల చేసారు.

# కరోనా నిబంధనలతో పెద్ద దర్గా ఉరుసు ఉత్సవాలు

కడప డిసెంబర్ 14కడప పెద్ద దర్గా ఉరుసు మహోత్సవాన్ని ప్రత్యేక జాగ్రత్తలతో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్ర డిప్యూటీ సీఎం అంజాద్ బాష మీడియా సమావేశం నిర్వహించి డిసెంబర్ 18 నుంచి 25 వరకూ పెద్ద దర్గా ఉరుసు జరపాలని నిర్ణయం తీసుకున్నారు.ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని ప్లాన్ చేశారు. కొవిడ్ మూడో దశ వ్యాపిస్తున్న నేపథ్యంలో కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుందని తెలిపారు.ఒమిక్రాన్ వైరస్ దేశ వ్యాప్తంగా నమోదవుతున్న క్రమంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అయినప్పటికీ పక్క రాష్ట్రాల నుండి దర్గా ఉరుసుకు వచ్చేందుకు అవకాశం కల్పించారు. మత గురువు ఆదేశాల మేరకు ఉరుసు ఉత్సవాలను ఏకాంతంగా నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. యథావిధిగా దర్గా గంధం, ఉరుసు మహోత్సవం జరుగుతుంది. ప్రభుత్వం తరపున చాదర్‌ను సమర్పిస్తారు. ఉరుసు ఉత్సవాలకు పరిమిత సంఖ్యలో మాత్రమే హాజరుకావాలని అనుమతి ఇచ్చారు.ఉరుసులో వేలాది మంది పాల్గొనే ముషాయిరా, ఊరేగింపు, జ్యారస్ కార్యక్రమాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకునే ఈ నిర్ణయం తీసుకున్నామని అన్నారు.

# రోజాకు తప్పిన ముప్పు

హైదరాబాద్, డిసెంబర్ 14, (న్యూస్ పల్స్)నగరి వైసీపీ ఎమ్మెల్యే రోజాకు తృటిలో పెను ప్రమాదం తప్పింది. రోజా ప్రయాణిస్తున్న విమానంలో సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో విమానంలో ఉన్న ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. కానీ పైలెట్ తిరుపతిలో దిగాల్సిన విమానాన్ని బెంగుళూరులో సురక్షితంగా దించాడు.అయితే ఎమ్మెల్యే రోజా ప్రయాణిస్తున్న విమానం రాజమండ్రి నుంచి తిరుపతి వెళ్లాల్సి ఉంది. రోజా ఎక్కిన ఇండిగో ఎయిర్‌లైన్స్ విమానం ఈరోజు ఉదయం10:55 గంటలకు తిరుపతికి చేరుకోవాల్సి ఉంది. కానీ ఫ్లైట్?లో సాంకేతిక లోపం తలెత్తింది. గమనించిన పైలట్ చాకచాక్యంగా వ్యవహరించి విమానాన్ని బెంగళూరు వైపు తీసుకెళ్లారు. ఆ సమయంలో విమానంలోని 70 మంది ప్రయాణికులు ప్రయాణిస్తున్నారు.వీరంతా బెంగుళూరులో ఫ్లైట్ సురక్షితంగా ల్యాండ్ కావడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనపై ఎమ్మెల్యే రోజా సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. 'ఇంకా విమానంలోనే ఉన్నాం. విమానం డోర్స్ ఇంకా ఓపెన్ కాలేదు. పైలట్‌కు ఇంకా ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదు' అని రోజా ఓ వీడియోను విడుదల చేశారు. ప్రస్తుతం ఈ వీడియో వైరల్?గా మారింది.

# ఇంట్లోనే దొంగనోట్లు

విజయవాడ, డిసెంబర్ 14,(న్యూస్ పల్స్)వందకు నాలుగువందలు . అవును, ఇప్పుడు బెజవాడలో ఇదే దందా సాగుతోంది. ఉదాహరణకు మనం లక్ష ఇస్తే? మనకు వాళ్లు 4 లక్షలు ఇస్తారు. ఇదేదో అధిక వడ్డీ ఇచ్చే బిజినెస్ కాదు.. నెలలు, సంవత్సరాలు వెయిట్ చేయాల్సిన పనిలేదు. జస్ట్ రోజుల్లో పని. ఇలా ఇచ్చి అలా తీసుకోవచ్చు. కానీ, ఇది పక్కా ఫేక్ నోట్ల వ్యాపారం. ఎట్టకేలకు కృష్ణా జిల్లాలో ఈజీ మనీకి అలవాటుపడ్డ కేటుగాళ్ల బండారం బయటపడింది.డబ్బులు సంపాదించాలనే ఆలోచనతో నకిలీ కరెన్సీ ముద్రించి.. వాటిని చెలామణి చేసేందుకు ప్రయత్నించిన ముఠాను పెడన పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. యూ ట్యూబ్ ద్వారా నకిలీ కరెన్సీని ఎలా తయారు చేయాలో తెలుసుకుని.. వాటిని ఎలా ముద్రించాలి, ఎలా చెలామణి చేయాలి అనే అంశాలపై మూడు నెలలపాటు క్షుణ్ణంగా అధ్యయనం చేశారు. పక్కాగా అమలు చేయాలనుకున్నారు. అయితే, వారి ప్లాన్‌ను ఏపీ పోలీసులు ఆదిలోనే చెక్ పెట్టారు. పెడన పట్టణంలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన వివరాలు మచిలీ పట్నం డీఎస్పీ షేక్ మసూంబాషా మీడియాకు వివరించారు. సూత్రధారితో పాటు కేసుతో సంబంధం ఉన్న మొత్తం ఎనిమిది మందిని మీడియా ముందు ప్రవేశపెట్టారు.కృష్ణా జిల్లా పెడనలో పట్టుబడ్డ గ్యాంగ్ ఇది. డీఎస్పీ షేక్ మసూంబాషా తెలిపిన వివరాల ప్రకారం.. కాసా వెంకటేశ్వరరావు అనే వ్యక్తి.. ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసేలా దుకాణం తెరిచాడు. వీరభద్రపురంలోని కాసా నాగరాజు అనే వ్యక్తి ఇంట్లో దొంగనోట్ల కుటీర పరిశ్రమే పెట్టేశాడు. ఒక స్కానర్, ప్రింటర్, పేపర్ కట్టర్‌లతో ముద్రణ నడిపిస్తున్నాడు. ఇతనితోపాటు మధ్యవర్తులు కూడా జతకలిశారు. లక్ష ఒరిజినల్‌కు 4లక్షల ఫేక్ నోట్లు ఇచ్చే ఈ బిజినెస్‌లో 35 నుంచి 40శాతం కమిషన్ కూడా ఇస్తున్నాడు. ఇప్పటికి ఈ గ్యాంగ్ ఇన్ని కోట్లు ముద్రించిందో, అంత సొమ్మును ఎలా మార్కెట్‌లోకి చొప్పించిందో ! మొత్తం 9మందిని అరెస్ట్ చేసి వాళ్ల నుంచి ఈ ప్రశ్నలకు సమాధానం సేకరించే పనిలో ఉన్నారు పోలీసులు.ఈ క్రమంలోనే పట్టణంలోని దక్షిణ తెలుగుపాలెంకు చెందిన ముచ్చు శివ తన తల్లి వైద్యఖర్చుల నిమిత్తం రామలక్ష్మీవీవర్స్‌కాలనీకి చెందిన వాసా వెంకటేశ్వరరావు దగ్గర అప్పుగా రూ.2వేలు తీసుకున్నాడు. వీటితో శివ స్థానికంగా మెడికల్ దుకాణంలో మందులు కొనుగోలు చేసేందుకు నగదు ఇచ్చాడు. మెడికల్ షాపులో ఉన్న వ్యక్తి ఆ నోట్లలో తేడాను గమనించి.. ఇవి దొంగనోట్లు అని చెప్పడంతో శివ తిరిగి వాసా వెంకటేశ్వరరావు వద్దకు వెళ్లాడు. వెంకటేశ్వరరావు అవి దొంగనోట్లు కాదని, తనకు వీరభద్రపురంలోని కాసా నాగరాజు, అతని కుమారుడు ఇచ్చారని చెప్పాడు. అనుమానం వచ్చిన శివ పెడన పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కాసా నాగరాజు అసలు భాగోతం వెలుగులోకి వచ్చింది. కాగా, ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదు చేశామని, పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నామని మచిలీ పట్నం డీఎస్పీ షేక్ మసూంబాషా తెలిపారు.

# లిక్కర్ డోర్ డెలివరీ..?



హైదరాబాద్, డిసెంబర్ 14, (న్యూస్ పల్స్)తెలంగాణలో త్వరలో లిక్కర్ డోర్ డెలివరి కానుందా? మద్యం ప్రియులు కూడా అదే కోరుకుంటున్నారా? అంటే అవుననే తెలుస్తోంది. సూర్యాపేట జిల్లాలో ఇప్పటికే మొదలైంది కూడా. అయితే లిక్కర్ డోర్ డెలివరీని ప్రస్తుతం ప్రభుత్వం అందించడం లేదు. మద్యం వ్యాపారులే మొదలు పెట్టేశారు. మద్యం ప్రియుల నుంచి డిమాండ్ వస్తుండటంతో లిక్కర్ ను వాళ్ల ఇంటి దగ్గరే అందించేందుకు ఏర్పాట్లు చేశారు. సూర్యాపేట జిల్లాలోని ఓ మద్యం షాపులో డోర్ డెలివరీని ప్రారంభించగా.. మంచి స్పందన వస్తుందని అంటున్నారు.నిజానికి తెలంగాణలో మద్యం డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. దక్షిణాదిలోని మిగితా రాష్ట్రాలతో పోల్చుకుంటే తెలంగాణలోనే లిక్కర్ సేల్స్ ఎక్కువ. సర్కార్ కు ఎక్సైజ్ నుంచి వచ్చే ఆదాయమే ఎక్కువ. అందుకే తెలంగాణ సర్కార్ ప్రతి ఏటా మద్యం షాపులను పెంచుకుంటూ పోతుంది. డిసెంబర్ నెలలో మొదలైన కొత్త షాపుల టెండర్ల సమయంలోనూ మరో 4 వందలకు పైగా కొత్త షాపులను మంజూరు చేసింది. గతంలో ఒక్కో మండలానికి ఒక వైన్ షాపు ఉండగా... ఇప్పుడు రెండు, మూడు కూడా ఉన్నాయి. దీంతో మద్యం వ్యాపారుల మధ్య పోటీ పెరిగింది. ఇది కూడా డోర్ డెలివరీకి అవకాశం ఇచ్చిందంటున్నారు. కస్టమర్స్ ను ఆకర్షించి తమ సెల్స్ పెంచటానికి ఇంటికే వచ్చే లిక్కర్ అందిస్తామని కొందరు వ్యాపారులు ఆఫర్లు పెట్టారని తెలుస్తోంది. ఇలా ఒకరిని చూసి మరొకరు డోర్ డెలివరీ సిస్టమ్ వైపు మొగ్గు చూపుతున్నారని చెబుతున్నారు. కొందరు ఎక్స్ ట్రా డబ్బులు తీసుకుంటగా.. ఇంకొందరు మాత్రం ఫ్రీగానే డోర్ డెలివరీ చేస్తున్నారు. లిక్కర్ డోర్ డెలివరికి సంబంధించి గత సెప్టెంబర్ జరిగిన ఓ సర్వేలోనూ తెలంగాణకు సంబంధించి ఆసక్తికర ఫలితాలు వచ్చాయి. ఇంటర్నేషనల్ స్పిరిట్ అండ్ వైన్స్ అసోసియేషన్ కస్టమర్ పల్స్ నిర్వహించిన సర్వేలో తెలంగాణలో వంద శాతం మంది డ్రింకర్లు డోర్ డెలివరీ కోరుకున్నారు. తెలంగాణ సహా ఎనిమిది రాష్ట్రాల్లో ఆ సంస్థ సర్వే జరపగా.. మిగితా ఏడు రాష్ట్రాల్లో 70 శాతం మంది ప్రజలు డోర్ డెలివరీకి మొగ్గు చూపారు. తెలంగాణకు సంబంధించి నిజామాబాద్, నల్గొండ, సంగారెడ్డి, ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్ జిల్లాలో డోర్ డెలివరీకి సంబంధించి డిమాండ్ కనిపించింది. దాదాపు ఏడున్నర వేల మందిని ప్రశ్నించి ఈ సర్వే చేసింది అయితే డోర్ డెలివరీకి సర్వీస్ చార్జీ విషయంలో మాత్రం భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. సిటీ ప్రాంత ప్రజలు 50 నుంచి 100 రూపాయలు వసూల్ చేయవచ్చని చెప్పగా... మధ్య తరగతి ప్రజలు మాత్రం 5 నుంచి 10 రూపాయలు మాత్రమే డోర్ డెలివరీకి సర్వీస్ చార్జీ తీసుకోవాలని తమ అభిప్రాయం చెప్పినట్లు సర్వే వెల్లడించింది. తమ సంస్థ సర్వేలో వెల్లడైన అంశాలను తెలంగాణ సర్కార్ కు నివేదిస్తామని సీఈవో కపూర్ చెప్పారు. ప్రభుత్వమే అధికారికంగా లిక్కర్ డోర్ డెలివరీ చేసేలా చర్యలు తీసుకోవాలని సూచిస్తామని చెప్పారు. మన దేశంలో ఇప్పటికే కొన్ని రాష్ట్రాల్లో ఈ విధానం అమలులో ఉంది. కొవిడ్ సమయంలో పశ్చిమ బెంగాల్, చత్తీస్ గఢ్, అసోం, ఒడిషా, మహారాష్ట్ర, మేఘాలయ, పంజాబ్, పుదిచ్చేరి రాష్ట్రాల్లో అమలు చేశారు. ఇప్పుడు కూడా కొనసాగిస్తున్నారు. ప్రజల నుంచి డిమాండ్ ఉన్న నేపథ్యంలో తెలంగాణ సర్కార్ కూడా లిక్కర్ డోర్ డెలివరీని ప్రారంభిస్తే మంచిదనే సూచన వస్తోంది. కొవిడ్ రూల్స్ పాటిస్తూ డోర్ డెలివరీ చేస్తే లిక్కర్ షాపుల దగ్గర రద్దీని కూడా తగ్గించేవచ్చనే అభిప్రాయం వస్తోంది

# ఈనెల 16 నుంచి జనవరి 14 వరకు తిరుప్పావై ప్రవచనములు

కడప డిసెంబర్ 14: ఈనెల 16 నుంచి జనవరి14 వరకు నెలరోజుల పాటు తితిదే ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు సౌజన్యంతో స్థానిక జవులీ బజార్ వీధిలోని శ్రీ కోదండరామ స్వామి దేవస్థానం నందు ప్రముఖ తిరుప్పావై ప్రవచకులు రాళ్లబండి రాఘవన్ చే తిరుప్పావై ప్రవచనములు జరుపనున్నట్లు తితిదే పిఆర్ఓ రవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. "ధనుర్మాస ఉత్సవముల" సందర్భంగా ప్రతి ఏడాది లాగే ఈనెల 16 నుంచి జనవరి14 వరకు ఆళ్వారుల వైభవం గురించి తిరుప్పావై ప్రవచనం జరుగుతుందన్నారు. శ్రీమన్నారాయణుని వైభవమును తమిళ భాషలో కీర్తించిన 12 మంది భక్త శిఖామణులు ఆళ్వారులలో గోదాదేవి ఒకరు. ఈమె శ్రీ వైష్ణవ సాంప్రదాయంలో అండాళ్ అనే పేరుతో ప్రసిద్ధి చెందారు. ఈమె భక్త లోకానికి ప్రసాదించిన తిరుప్పావై దివ్య ప్రబంధం గురించి, అందులోని అమూల్య సందేశాన్ని అందుకొని ఆనందించి తరించాలన్నారు. విష్ణుమూర్తికి ప్రీతిపాత్రం ఈ ధనుర్మాసం ఈ ధనుర్మాసం లో భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో వ్రతాలూ.. నోములు నిర్వహిస్తారు . సూర్యుడు ధనూరాశిలో ప్రవేశించినప్పటి నుంచీ ధనుర్మాసం మొదలవుతుంది. అప్పటి నుంచి భోగి పండుగ వరకూ నెల రోజుల కాలాన్ని తెలుగువారు నెలగంటగా పరిగణిస్తూ పూజలు చేపడతారు. 'ధను' అంటే ప్రార్థించేది.. సిద్ధిస్తుంది అని పురాణాలు చెబుతున్నాయి. ఆండాళ్ రచించిన దివ్యప్రబంధమే 'తిరుప్పావై' గా చెబుతారు. ద్రావిడ భాషలో 'తిరు' అంటే పవిత్రమనీ, 'పావై' అంటే వ్రతమనీ అర్థం. అందుకోసమే ధనుర్మాసం నెలలో నిర్వహించే వ్రతాలు పరమ పవిత్రమైనవనీ ప్రతిఫలంగా మహాలక్ష్మి అనుగ్రహం లభిస్తుందనీ భక్తుల నమ్మకం. భక్తాదులు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని గోదాదేవి, శ్రీరంగనాథుని కృపా కటాక్షములు పొందాలని ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు, దేవస్థాన కమిటీల తరపున కోరుతున్నట్లు పిఆర్ఓ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# ఏపీలో గ్రీన్‌లామ్ పెట్టుబడులు.. విస్తరణకు రూ. 950 కోట్లు కేటాయింపు

**నాయుడుపేటలో ల్యామినేట్ ప్లాంట్**

**షేర్ల విభజనకు బోర్డు గ్రీన్‌సిగ్నల్**




న్యూఢిల్లీ: సర్ఫేసింగ్ సొల్యూషన్స్ కంపెనీ గ్రీన్‌లామ్ ఇండస్ట్రీస్ విస్తరణ బాట పట్టింది. రానున్న రెండు, మూడేళ్లలో రూ. 950 కోట్లను ఇన్వెస్ట్ చేయనున్నట్లు వెల్లడించింది. దీనిలో భాగంగా మూడో ల్యామినేట్ ప్లాంటు ఏర్పాటుతోపాటు.. ప్లైవుడ్, పార్టికల్ బోర్డ్ బిజినెస్‌లోకి ప్రవేశించనున్నట్లు పేర్కొంది. పూర్తి అనుబంధ సంస్థ గ్రీన్‌లామ్ సౌత్ లిమిటెడ్ ద్వారా ఆంధ్రప్రదేశ్‌లోని నాయుడుపేట వద్ద కొత్త ల్యామినేట్ ప్లాంటు, పార్టికల్ బోర్డ్ తయారీ సౌకర్యాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలియజేసింది. మెషీనరీపై రూ. 600 కోట్లు, ల్యామినేట్ సామర్థ్యం ఏర్పాటుకు రూ. 225 కోట్లు చొప్పున వెచ్చించనున్నట్లు వివరించింది. పార్టికల్ బోర్డ్స్ తయారీకి వీలుగా ఆధునిక సాంకేతికత, పరికరాలు, మెషీనరీ కోసం రూ. 600 కోట్లు వెచ్చించనున్నట్లు పేర్కొంది. తద్వారా వార్షికంగా 2,31,000 సీబీఎం సామర్థ్యంతో పార్టికల్ బోర్డులను రూపొందించనున్నట్లు తెలియజేసింది. ఈ బాటలో వార్షికంగా 3.5 మిలియన్ ల్యామినేట్ షీట్లు, బోర్డుల తయారీకి వీలుగా మరో రూ. 225 కోట్లను వెచ్చించనున్నట్లు వెల్లడించింది. ల్యామినేట్ పరిశ్రమలోనే తొలిసారి అత్యంత ఆధునికత కలిగిన సమీకృత సౌకర్యాలతో ప్లాంటును ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొంది. కొత్తగా చేజిక్కించుకున్న అనుబంధ సంస్థ హెచ్‌జీ ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో ప్లైవుడ్ తయారీకి ప్రత్యేకించిన యూనిట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలియజేసింది. తమిళనాడులోని టిండివనమ్ వద్ద రూ. 125 కోట్ల పెట్టుబడితో 18.9 మిలియన్ చదరపు మీటర్ల వార్షిక సామర్థ్యంతో నెలకొల్పనున్నట్లు వెల్లడించింది. వెరసి కొత్తగా ఏర్పాటు చేయనున్న తయారీ యూనిట్లపై రెండు, మూడేళ్లలో రూ. 950 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు గ్రీన్‌లామ్ ఇండస్ట్రీస్ ఎండీ, సీఈవో సౌరభ్ మిట్టల్ స్పష్టం చేశారు. కంపెనీ ఈక్విటీ షేర్లను 1:5 ప్రాతిపదికన విభజించేందుకు బోర్డు అనుమతించినట్లు గ్రీన్‌లామ్ ఇండస్ట్రీస్ తాజాగా వెల్లడించింది. వెరసి రూ. 5 ముఖ విలువగల ఒక్కో షేరునీ రూ. 1 ముఖ విలువగల 5 షేర్లుగా విభజించనుంది. ఈ వార్తల నేపథ్యంలో గ్రీన్‌లామ్ షేరు బీఎస్ఈలో దాదాపు యథాతథంగా రూ. 1,689 వద్ద ముగిసింది.

# జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద స్వచ్ఛభారత్ కార్మికుల ధర్నా

కడప డిసెంబర్14కడపలో స్వచ్ఛభారత్ కార్మికుల యూనియన్ ఏఐటియుసి రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా మంగళవారం జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద నిరసన ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛభారత్ పేరిట ప్రచార ఆర్భాటాలకు నీళ్ళలాగా ఖర్చు చేస్తూ,వాహనాలు కొనుగోలులో కమిషన్లకు కక్కుర్తి పడి కార్మికుల సంక్షేమం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.జగనన్న స్వచ్ఛ సంకల్పం పేరిట కార్మికులను ఇబ్బందులు చేసే అటెండెన్స్ విధానము రోజు ఉదయము,సాయంత్రము జెఎస్ఎస్ యాప్ లో పనీ ఫోటోలు ద్వారా ఉంటేనే వేతనాలు చెల్లిస్తామన్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికార పార్టీ సర్పంచులు తమ వారిని నియమించుకోవాలనే నెపంతో ఇష్టానుసారంగా తప్పులు చేయకపోయిన తొలగిస్తున్నారని అలాంటి నిర్ణయాలు విరమించు కోకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.గ్రామాల్లో చెత్త తొలగించాల్సి ఉండగా వారికి సంబంధం లేని పనులు కూడా చేయిస్తున్నారని ఆరోపించారు.సుప్రీంకోర్టు,హైకోర్టు తీర్పుల ప్రకారం మున్సిపల్ కార్మికుల మాదిరిగానే సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, సామాజిక భద్రత చట్టం లో భాగంగా పీఎఫ్,ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ధర్నా అనంతరం జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్ రెడ్డి, ఏవో రంగస్వామి కి వినతి పత్రాలు సమర్పించడం జరిగింది.ఈ ధర్నా కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర అధ్యక్ష,కార్యదర్శి లు పి.సుబ్బారాయుడు,ఉద్దే. మద్దిలేటి స్వచ్ఛభారత్ కార్మికుల యూనియన్ (ఎఐటియుసి)జిల్లా ఉపాధ్యక్షులు ఆంజనేయులు, రెడ్డయ్య ,సహాయ కార్యదర్శిలు ఆనందరావు, ప్రతాప్, సుధాకర్ భూషణం తదితరులు పాల్గొన్నారు.

# పోరాటాల వేదికగా డివైఎఫ్ఐ జిల్లా మహాసభ

మైదుకూరు కడప లో ఈనెల 18 న డివైఎఫ్ఐ కడప జిల్లా మహాసభ నిర్వహించడం జరుగుతుందని జయప్రదం చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల.శివకుమార్ జిల్లా ఉపాధ్యక్షులు ముడియం చిన్ని లు తెలిపారు. ఈరోజు ఉదయం మైదుకూరు పట్టణంలో మహాసభలు జయప్రదం చేయాలని మహాసభల కరపత్రాలు విడుదల చేసారు. ఈ సందర్భంగా శివకుమార్ జిల్లా ఉపాధ్యక్షులు ముడియం చిన్ని మాట్లాడుతూ.... కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ యువతకు ఇచ్చిన వాగ్దానాలను మరిచాయని అన్నారు.కేంద్రంలో నరేంద్రమోదీ ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని నోట్లరద్దు,ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ పేరుతో లక్షల ఉద్యోగాలు పోగొట్టాడు అన్నారు.రాష్ట్రానికి ఇచ్చిన హామీ ప్రత్యేక హోదా,రైల్వేజోన్,కడప ఉక్కు పరిశ్రమ,రాయలసీమకు ప్యాకేజి ఏవీ అమలుకాలేదు అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం కూడా ఉద్యోగాల భర్తీ విషయంలో యువతకు అన్యాయం చేస్తుంది అన్నారు.జాబులు లేని క్యాలెండర్ ను వదిలి నిరుద్యోగులకు అన్యాయం చేసింది అన్నారు.రాష్ట్ర వాటా కోసం కేంద్రంతో గట్టిగా పోరాడటం లేదన్నారు.రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 1.84 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలన్నారు.కార్పొరేషన్ల ద్వారా యువతకు రుణాలు ఇవ్వాలన్నారు.వీటన్నింటి పైన మహాసభ లో చర్చిస్తామన్నారు.కార్యక్రమంలో . మైదుకూరు పట్టణ కార్యదర్శి రెబ్బ నరసింహ నాయకులు రాము పోలేరు ఎం పావని అమూల్య అవి లా తదితరులు పాల్గొన్నారు

# స్టాంప్ డ్యూటీ నిధులను వెంటనే మంజూరు చేయాలి

తుగ్గలి తుగ్గలి మండల పరిధి లోని గల గ్రామ పంచాయతీలకు సంబంధించి స్టాంప్ డ్యూటీ నిధులను వెంటనే మంజూరు చేయాలని జిల్లా సబ్ రిజిస్టర్ అధికారికి సర్పంచులు సోమవారం రోజన వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచులు మాట్లాడుతూ తుగ్గలి,డోన్ మండలాల్లోని కొన్ని గ్రామాలు ప్యాపిలి మండల సబ్ రిజిష్టర్ పరిధిలోకి వస్తాయని,గ్రామ పంచాయతీలకు రావలసిన స్టాంప్ డ్యూటీ నిధుల గురించి ప్యాపిలి సబ్ రిజిష్టర్‌ను అడుగగా,మా ఆఫీసులో సిబ్బంది లేరని అంటున్నారని వారు తెలియజేశారు.తద్వారా గ్రామ పంచాయతీలకు సంబంధించి నిధులు విడుదల చేయడం లేదని వారు తెలియజేస్తున్నారు.మా పంచాయతీలకు గత మూడు సంవత్సరాల నుండి ప్యాపిలి సబ్ రిజిష్టర్ స్టాండ్యూటీ నిధులను విడుదల చేయకపోవడంతో మేము ఇబ్బందులు పడుచున్నామని,కావున తమరు స్పందించి ప్యాపిలి సబ్ రిజిష్టర్ యందు గ్రామ పంచాయతీలకు రావలసిన నిధుల స్టాంప్ డ్యూటి విడుదల అయ్యేలా చూసి మా ఇబ్బందులు లేకుండా చూడాలని సర్పంచులు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచులు చౌడప్ప,మస్తాన్ బి,రవి మోహన్,రామలక్ష్మి, రంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

# తెలుగుదేశం పార్టీ గౌరవ సభ

కడప డిసెంబర్ 14 కడప తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న గౌరవ సభలలో బాగంగా కడప నియోజకవర్గంలోని 50 (సాయిపేట) నందు కడప నియోజకవర్గ ఇంచార్జ్ అమీర్ బాబు గారు మరియు రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి బాలిశెట్టి హరిప్రసాద్ గారు మాట్లాడుతూగత ప్రభుత్వాలు ఫీజ్ రీ ఏంబర్స్మెంట్ పేరుతో విద్యార్థుల ఫీజు బకాయిలు నేరుగా కాలేజీలకు పంపటం జరిగేది విద్యార్థులకు మేలు జరిగేది కానీ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన

తర్వాత అదేదో తోలి సారి ఈ పథకం మొదలు పెట్టినట్లు కాలేజీలకు కాకుండా విద్యార్థి తల్లిదండ్రులకి నేరుగా పంపడం వల్ల కాలేజీలకు ఫీజులు సకాలంలో చెల్లింపులు జరగక కాలేజీలు మూసే పరిస్థితి కి వచ్చారు, జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంపై ఈ విషయంలో కోర్టులు కూడా మొట్టికాయలు వేశాయి.ఈ ప్రభుత్వ తీసుకుంటున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలను న్యాయస్థాలు అడ్డుకోవడం జరగకపోయి ఉంటే ఈ పాటికి రాష్ట్రం దివాలా తీసి ఉండేది కాబట్టి ఈ ప్రజావ్యతిరేక ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ప్రజలంతా ఏకతాటిపైకి రావాలని కోరారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నగర ప్రధాన కార్యదర్శి జయ కుమార్, అన్వర్ హుస్సేన్, సుబ్బారెడ్డి. చంద్రబాబు, రవి శంకర్ రెడ్డి, కొండ సుబ్బయ్య, వరప్రసాద్,సుగవాసి రాజా, మన్సూరు అక్బర్, కొమ్మలపాటి సురేష్, అధిక సంఖ్యలో మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## వీఆర్వోల సంఘం మండల అధ్యక్షునిగా బాలవర్ధి నాయుడు



తుగ్గలి డిసెంబర్ 14 ( విభారె) : తుగ్గలి మండల వీఆర్వోల సంఘం మండల అధ్యక్షులుగా బాలవర్ధన్ నాయుడును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధికారులు ఎన్నికల అధికారిగా విఆర్ఓ కాశీ రంగస్వామి ను నియమించడంతో మంగళవారం రోజున తహసిల్దార్ కార్యాలయంలో వీఆర్వోల సంఘం ఎన్నికను నిర్వహించారు. ఈ ఎన్నికల యందు విఆర్ఓలు బాలవర్ధి నాయుడును మండల అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదేవిధంగా ఈ ఎన్నికల్లో భాగంగా కార్యదర్శిగా రవి,ఉపాధ్యక్షులుగా వాసు దేవయ్య,వెంకట రమణారెడ్డి లను,ట్రెజరర్ గా రేష్మ,సంయుక్త కార్యదర్శిగా రంగన్న లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీఆర్వోల సమస్యల గురించి తమ వంతు కృషి చేస్తామని వారు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎన్నికైన వీఆర్వోలకు తుగ్గలి తహశీల్దార్ నజ్మా భాను,డిప్యూటీ తహసిల్దార్ నిజాముద్దీన్ మరియు మండల సర్వేయర్ గాది లింగప్ప లు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ ఇన్స్పెక్టర్ సుధాకర్ రెడ్డి,వీఆర్వోలు నాగేంద్ర,వెంకట రాముడు,రామాంజనేయులు, రామలింగప్ప తదితరులు పాల్గొన్నారు.

### అసెంబ్లీలో అనుచిత వ్యాఖ్యలు తప్ప అభివృద్ధి లో ఒరిగింది ఏమి లేదు

### నష్టపోయిన రైతులను అందుకోని నష్టపరిహారం ఇవ్వాలి

### మంత్రాలయం నియోజకవర్గం టిడిపి ఇన్ చార్జ్ పాలకుర్తి తిక్కరెడ్డి

కౌతాళం డిసెంబర్ 14 ( విభారె)అసెంబ్లీలో అనుచిత వ్యాఖ్యలు తప్ప మంత్రులు, ఎమ్మెల్యేలు అభివృద్ధి లో ఒరిగింది ఏమి లేదని వైయస్సార్ ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హమీలు అమలు చేయాలని మంత్రాలయం నియోజకవర్గం ఇన్ చార్జ్ పాలకుర్తి తిక్కరెడ్డి,పేర్కొన్నారు. మంగళవారం వారు కౌతాళం మండలం లోని ఏరిగేరి, కామవరం, ఉరుకుంద,ఓబుళపురం,చిర్తపల్లి,తిప్పులదోడ్డి, గ్రామాలలో ×గౌరవసభ కార్యక్రమంలో పాల్గొన్ని మాట్లాడుతూ అసెంబ్లీలో ప్రజలు సమస్యలు పై చర్చ జరపకుండా మా నాయకుడు చంద్రబాబు నాయుడు పై వారి కుటుంబ సభ్యులు అసభ్యంగా మాట్లాడుతూ అవమానించడానికా మీరు అసెంబ్లీ కి పోయింది అని వైయస్సార్ ఎమ్మెల్యే లకు మంత్రులకు సవాలు విసిరారూ. రాష్ట్రంలో వైయస్సార్ ప్రభుత్వం పరిపాలన లో విఫలం అయింది అని ఎక్కడ కూడా అభివృద్ధి చేయలేదు అని ప్రజలను మోసము చేసి గెలిచారని వారు పేర్కొన్నారు. నిత్యావసర, గ్యాస్,పెట్రోల్,డీజిల్, సరుకులు ధరలు పెంచి ప్రజలు పై భారం మోపారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంవత్సరం రైతులకు వర్షలు ఎక్కువ అయి సరైన సమయంలో వర్షలు రాక చాలా నష్టం జరిగిందని రైతులను అదుకోవాలని నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# సంక్షేమ హాస్టళ్ల సమస్యలు ప్రభుత్వానికి పట్టవా..?




ఎమ్మిగనూరు డిసెంబర్ 14 ( విభారె) : పట్టణంలో సంక్షేమ హాస్టల్లో సమస్యలు రాష్ట్ర ప్రభుత్వానికి పట్టవా అని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పి.డీ.ఎస్.యు)జిల్లా ఉపాధ్యక్షులు మహేంద్ర బాబు ప్రశ్నించారు. అనంతరం స్థానిక ఎమ్మిగనూరు పట్టణంలో వీవర్స్ కాలనీ ప్రభుత్వ పాఠశాల నుండి ఎమ్మార్వో కార్యాలయం వరకు భారీ ర్యాలీ వేళ్లి ధర్నా నిర్వహించి డిప్యూటీ తహసీల్దార్ రమాదేవి గారికి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా మహేంద్ర బాబు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సాంఘిక సంక్షేమ హాస్టల్లో పరిస్థితి దుర్మార్గంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా హాస్టల్ లో సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం అద్దెలు చెల్లించకుండా పేద, బడుగు,

### హాస్టల్ విద్యార్థుల ఆకలి కేకలు పీ డీ ఎస్ యు జిల్లా ఉపాధ్యక్షులు మహేంద్ర బాబు

బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులతో చెలగాటమాడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా మాట తప్పను మడమ తిప్పను అని చెప్పి సంక్షేమ హాస్టళ్లను సమస్యలు పరిష్కరిస్తాం ధరలకు అనుగుణంగా మెస్చార్జీలు కాస్మోటిక్ ఛార్జీలు పెంచుతామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత కష్టాలను పట్టించుకునే స్థితిలో జగన్ రెడ్డి ప్రభుత్వం లేదని వాపోయారు. హాస్టల్లో సంబంధించిన విద్యార్థులకు ఇంతవరకు పెండింగ్ బకాయిలు చెల్లించలేదు. సన్న బియ్యం ఇస్తానని హామీ ఇచ్చారు ఎక్కడ కూడా ఇవ్వలేని స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కావున సంక్షేమ హాస్టల్ చదువుతున్న విద్యార్థులకు సరైన మౌలిక వసతులు కల్పించి సొంత భవనాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలు, కాస్మోటిక్ ఛార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. తక్షణమే సన్న బియ్యం పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సీఎం ఇల్లు ముట్టడి చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తాలూకా అధ్యక్షుడు రామకృష్ణ నాయుడు, పట్టణ అధ్యక్షుడు సమీర్, నాయకులు శీను, నరసింహారెడ్డి, లక్ష్మణ్, సూర్యప్రకాష్,విద్యార్థులు మొదలైన వారు పాల్గొన్నారు.

# ఏఐటీయుసి 17 వ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి

ఎమ్మిగనూరు డిసెంబర్ 14 ( విభారె) : ఏఐటీయుసి 17వ రాష్ట్ర మహాసభలు గుంటూరు నగరంలో జనవరి 29 30 31 తేదీల్లో జయప్రదం చేయాలని కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఏఐటీయుసి జిల్లా కార్యదర్శి మునెప్ప పిలుపునిచ్చారు ఎమ్మిగనూరు తాలూకా ఏఐటియుసి మహాసభకు బాలరాజు అధ్యక్షత వహించడం జరిగింది ఈ సందర్భంగా ఏఐటియుసి జిల్లా కార్యదర్శి మునెప్ప ముఖ్య అతిథిగా హాజరై వారు మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్మిక రైతు ప్రజావ్యతిరేక విధానాలను సాగిస్తుందని అనేక పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను నాలుగు చట్టాలకు గుర్తించడం తగదని పెట్టుబడిదారీ కార్పొరేట్ అనుకూల చట్టాలు తీసుకొస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్నారని పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు పెంచి ప్రజల నడ్డి విరుస్తున్నారని రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం రెండున్నర సంవత్సరాల కాలంగా నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో పూర్తిగా వైఫల్యం చెందిందని ఉద్యోగాలు లేక యువత అసాంఘిక శక్తులుగా మారే ప్రమాదం ఉన్నదని ప్రజలపై పన్ను భారం వేస్తూ ఇంటి పన్ను నీటి పన్ను కు అదనంగా కొత్తగా చెత్త సేకరణ పేరుతో మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా ప్రభుత్వం పనులమీద పన్నులు వేస్తూ ప్రజలను దోచుకుంటున్నారని వారు ఆరోపించారు ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు పంపన గౌడు, చిన్నన్న,




రంగన్న ,సత్తన్న, తిమ్మగురుడు ,విజయేంద్ర, మద్దిలేటి నాయుడు, భాస్కర్ యాదవ్, మల్లికార్జున గౌడ్ ,నాయుడు ,దస్తగిరి ,దివాకర్ ,ఎస్ రాజు ,తదితరులు పాల్గొన్నారు ఈ సందర్భంగా ఏఐటియుసి తాలూకా కమిటీ ని ఎన్నుకోవడం జరిగింది గౌరవ అధ్యక్షులుగా సత్యన్న అధ్యక్షుడిగా వీరేశ ఉపాధ్యక్షులు నాగప్ప ,వీరేష్ ,దస్తగిరి తాలూకా కార్యదర్శిగా బాలరాజు సహాయ కార్యదర్శులు గా మలక్ అన్న గౌడ్, సతీష్, రాజు, ట్రెజరీ గా సోమ శంకర్ డిప్యూటీ కార్యదర్శి గా యల్లప్ప వర్కింగ్ ప్రెసిడెంట్ గా తిమ్మగురుడు 20 మందిని కార్యవర్గ సభ్యులు ఎన్నుకోవడం జరిగింది

### ఫైర్ సర్టిఫికెట్ లేకుండా కళాశాల నడుపుతున్న భారతి విద్యాసంస్థల యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి

### వివిధ విద్యార్థి సంఘాల నాయకులు బీసీ,ఎస్సి,ఎస్టీ,మైనార్టీ విద్యార్థి యువజన సమాఖ్య నేతల డిమాండ్




నంద్యాల డిసెంబర్ 14 ( విభారె) ::- ఫైర్ సర్టిఫికెట్ లేకుండా అధికారులను బోల్తా కొట్టించి కళాశాలలకు అనుమతులు పొందిన భారతి విద్యాసంస్థలను సీజ్ చేసేంత వరకు పోరాటం ఆగదని తెలిపారు. ఏఐయస్ ఫ్ జిల్లా అధ్యక్షుడు ధనుంజయుడు,పీడియస్ యు జిల్లా సహాయ కార్యదర్శి రఫీ,బీసీ,ఎస్సి,ఎస్టీ మైనార్టీ విద్యార్థి యువజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు శివకృష్ణ యాదవ్,యన్ యస్ ఫ్ జిల్లా . అధ్యక్షుడు డి.చిన్న,ఏఐయస్ ఎ నంద్యాల డివిజన్ కార్యదర్శి వినోద్ కుమార్, ఏఐయస్ ఫ్ .నం ద్యాల పట్టణ కార్యదర్శి హరికృష్ణఈ సందర్భంగా వారు మాట్లాడుతు భారతి విద్యాసంస్థల యాజమాన్యం ఒకే బిల్డింగ్ లో 5 కళాశాలలు నడుపుతూ ఎటువంటి ఫైర్ సర్టిఫికెట్ లేకుండా కళాశాల నడుపుతున్న భారతి విద్యాసంస్థల పై చర్యలు తీసుకోవాలని నంద్యాల లో డిస్టిక్ అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్ యోగేశ్వర్ రెడ్డి బీసీ,ఎస్సి,ఎస్టీ మైనార్టీ విద్యార్థి యువజన సమాఖ్య నేతలు వినతిపత్రం అందజేశారు. అయితే భారతి విద్యాసంస్థల బిల్డింగ్ కు ఫైర్ సర్టిఫికెట్ లేదని ఫైర్ ఆఫీసర్ యోగేశ్వర్ రెడ్డి 2018-19 విద్యాసంవత్సరంలోనే నోటీస్ ఇచ్చిన కూడా ఏ ఏమాత్రం చలనం లేకుండా ఫైర్ సర్టిఫికెట్ ను అప్లై చేయకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న భారతి విద్యాసంస్థల యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు అధికారులను డిమాండ్ చేశారు.

### గ్రాఫ్లింగ్ ప్రారంభిస్తున్న బియ్యపు ఆకర్ష్ రేడ్డి

శ్రీకాళహస్తి పట్టణం, జిఖ బాయ్స్ హై స్కూల్ నందు జిల్లాస్థాయి గ్రాప్లింగ్ పోటీలను మంగళవారం ప్రారంభించిన ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి తనయుడు ఆకర్ష్ రెడ్డి విద్యార్థుల తో కలసి సరదా కాసేపు వాళ్ళతో ఆటలు ఆడి అనంతరం స్కూల్ లో సమస్యలు అడిగి తేలుసుకున్నారు ఆయనతో పాటు వై. కా. పా నాయకులు మిద్దేల హరి, హరి రాయల్ తదితరులు పాల్గోన్నారు

# మెగా ఫ్యామిలీకి దూరంగా కళ్యాణ్..?

'విజేత' సినిమాతో హీరోగా ఇండస్ట్రీలో అడుగుపెట్టారు మెగా అల్లుడు కళ్యాణ్ దేవ్. చిరంజీవి చిన్న కుమార్తె శ్రీజ ను వివాహం చేసుకున్న దేవ్.. తొలి సినిమాతో హీరోగా సక్సెస్ ఫుల్ గా లాంచ్ కాలేదనే చెప్పాలి. అప్పటి నుంచి సినిమాల విషయంలో ఆచితూచి ముందుకు వెళ్తున్న కళ్యాణ్.. ప్రస్తుతం మూడు చిత్రాల్లో నటిస్తున్నారు. రాబోయే మూడు సినిమాలతో కళ్యాణ్ దేవ్ కెరీర్ గాడిలో పడుతుందని మెగా ఫ్యాన్స్ భావిస్తుండగా.. ఇప్పుడు యువ హీరో మెగా ఫ్యామిలీ నుంచి దూరంగా ఉంటున్నారనే ఓ న్యూస్ బయటకు వచ్చింది. అంతేకాదు దీనికి కారణం రామ్ చరణ్ అనే ఓ రూమర్ ఫిలిం సర్కిల్స్ లో



చక్కర్లు కొడుతోందిఇటీవల కాలంలో మెగా ఫ్యామిలీ అంతా కలిసి జరుపుకున్న వేడుకలలో అల్లుడు కళ్యాణ్ దేవ్ ఎక్కడా కనిపించలేదు. దీనికి తోడు శ్రీజ గత కొన్ని నెలలుగా తన ఇన్స్టాగ్రామ్ లో భర్త కళ్యాణ్ తో ఉన్న ఫోటోలను పోస్ట్ చేయలేదు. దీంతో భార్యాభర్తల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయని.. అందుకే మెగా ఫ్యామిలీకి దేవ్ దూరంగా ఉంటున్నారని ఆ మధ్య ఊహాగానాలు వినిపించాయి. అయితే ఇటీవల శ్రీజ బర్త్ డే సందర్భంగా ఇన్స్టాగ్రామ్ వేదికగా మెగా అల్లుడు రూమర్స్ కు చెక్ పెట్టారు. తన అర్ధాంగితో ఉన్న ఓ ఫోటోని షేర్ చేసి లవ్ సింబల్ తో శుభాకాంక్షలు తెలపడంతో పుకార్లకు ఫుల్ స్టాప్ పడింది. కాకపోతే మెగా హీరోలకు కళ్యాణ్ ఎందుకు దూరంగా ఉంటున్నాడనే విషయం మీద సందేహాలు మాత్రం నివృత్తి కాలేదు. ఈ నేపథ్యంలో బావ బావమరిది కళ్యాణ్ దేవ్ - రామ్ చరణ్ మధ్య విభేదాలు వచ్చాయని.. అందుకే మెగా ఫ్యామిలీ నుంచి చిన్నల్లుడు దూరంగా ఉంటున్నారనే పుకార్లు ఇప్పుడు సోషల్ మీడియాలో షికారు చేస్తున్నాయి. ఇందులో నిజమెంతో తెలియదు కానీ అభిమానులు మాత్రం మెగా హీరోలందరూ ఎప్పుడూ కలిసే ఉండాలని కోరుకుంటున్నారు. మరి త్వరలోనే చెర్రీ - కళ్యాణ్ ఉన్న ఫోటో ఒకటి షేర్ చేసి రూమర్స్ కు చెక్ పెడతారేమో చూడాలి. ఇకపోతే కళ్యాణ్ దేవ్ ప్రస్తుతం పులివాసు దర్శకత్వంలో "సూపర్ మచ్చి" సినిమా చేస్తున్నారు. అలానే 'అశ్వథ్థామ' ఫేమ్ రమణ తేజ డైరెక్షన్ లో రామ్ తళ్లూరి నిర్మాణంలో "కిన్నెరసాని" అనే వైవిధ్యమైన చిత్రంలో నటిస్తున్నారు. ఈ రెండు సినిమాలు చిత్రీకరణ పూర్తి చేసుకొని విడుదలకు సిద్ధం అవుతున్నాయి. ఇక శ్రీధర్ సీపాన దర్శకత్వంలో కళ్యాణ్ దేవ్ హీరోగా ఓ సినిమా తెరకెక్కుతోంది. జీఏ 2 పిక్చర్స్ సమర్పణలో పీపుల్ మీడియా ఫాక్టరీ - అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ సంస్థలు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి.

# 'పుష్ప'కి స్పైడర్ మ్యాన్' పోటీనా?

హాలీవుడ్ నుంచి ఏ సినిమా వచ్చినా సగటు ప్రేక్షకుడిలో మన సినిమాల కుండే క్రేజ్ వేరు. హాలీవుడ్ నుంచి క్రేజీ మూవీ వచ్చేస్తోంది కదా అని మన



సినిమాలని తెలుగు ప్రేక్షకుడు తక్కువ చేసిన సందర్భాలు కానీ .. పక్కన పెట్టిన సంఘటనలు కానీ అంటూ ఏమీ లేవు. ఎందుకంటే హోటల్ లో ఎంత రుచికరమైన భోజనం వున్నా అమ్మ చేతి వంటకే మనం ప్రాధాన్యతనిస్తుంటాం. అలాగే క్రేజీ హాలీవుడ్ సినిమాలు ఎన్నొచ్చినా మన సినిమాలకుండే ప్రత్యేకత వేరు.. మన సినిమా చూడాల్సిందే. ఇదే తెలుగు ప్రేక్షకుడిలో వున్న గొప్ప క్వాలిటీ. అయితే దీనికి కొంత మంది వక్ర భాష్యం చెబుతున్నారు. తాజాగా ఇలాంటి ప్రచారమే ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నటిస్తున్న క్రేజీ పాన్ ఇండియా మూవీ 'పుష్ప :ది రైజ్' విషయంలో జరుగుతోంది. సుకుమార్ డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీ ఇప్పటికే భారీ క్రేజ్ని సొంతం చేసుకుంది. టీజర్ ట్రైలర్ సాంగ్స్.. పుష్పరాజ్ మేకోవర్ కారణంగా క్రేజ్ని సొంతం చేసుకున్న ఈ మూవీ ప్రీ రిలీజ్ బిజినెస్ 250 కోట్లు జరిగి ఇండస్ట్రీలో హాట్ టాపిక్గా మారింది. భారీ అంచనాల మధ్య ఈ మూవీ తెలుగు తమిళ మలయాళ కన్నడ హిందీ భాషల్లో ఏక కాలంలో డిసెంబర్ 17న విడుదల కాబోతోంది. అయితే ఈ సినిమా విడుదల రోజే అంటే డిసెంబర్ 17న శుక్రవారం 'స్పైడర్ మ్యాన్ నో వే హోమ్' చిత్రం వరల్డ్వైడ్ గా విడుదల కాబోతోంది. 'స్పైడర్ మ్యాన్' సిరీస్ చిత్రాల్లో భాగంగా విడుదలవుతున్న ఈ చిత్రంపై సర్వత్రా భారీ అంచనాలే వున్నాయి. తెలుగులో 'స్పైడర్ మ్యాన్' సిరీస్ చిత్రాలకు మంచి క్రేజ్ వుందన్న విషయం తెలిసిందే. అయితే తెలుగు చిత్రాలని మించి మాత్రం క్రేజ్ లేదన్నది జగమెరిగిన సత్యం. మార్వెల్ స్టూడియోస్ చిత్రాలకు 'స్పైడర్ మ్యాన్' సిరీస్ చిత్రాలకు ఇండియా వ్యాప్తంగా ప్రత్యేకమైన అభిమానులున్నాయి. దీంతో ఈ సినిమాకు భారీ ఓపెనింగ్స్ వచ్చే అవకాశం వుంది. కానీ మన తెలుగు సినిమాలపై ప్రభావం చూపేంతగా దీని ఓపెనింగ్స్ వుంటాయంటే అది అతే అవుతుంది. కానీ కొంత మంది మాత్రం పని గట్టుకుని 'పుష్ప'ని 'స్పైడర్ మ్యాన్' చిత్రం దెబ్బతీస్తుందని దాని ప్రభావం ఓపెనింగ్ కలెక్షన్ ల పై పడుతుందని ప్రచారం చేస్తున్నారు. ఇందులో ఎలాంటి వాస్తవం లేదు. ఇప్పటికే 'పుష్ప' అడ్వాన్స్ బుకింగ్ పరంగానూ రికార్డు సృష్టిస్తోంది. ఓ పెనింగ్స్ కూడా భారీస్థాయిలో వుంటాయని ట్రేడ్ వర్గాలే చెబుతున్నాయి. ఇవన్నీ పక్కన పెట్టి స్ట్రెయిట్ సినిమాకి డబ్బింగ్ మూవీ పోటీ అంటూ 'పుష్ప'ని తొక్కేయాలని కొంత మంది చేస్తున్న ప్రచారం తప్పితే ఎక్కడా 'స్పైడర్ మ్యాన్' క్రేజ్ 'పుష్ప'ని మించి కనిపిస్తోందని చేస్తున్న ప్రచారం కొంత మంది కావాలని జస్ట్ సృష్టించిన రూమరే కానీ అది నిజం కాదు.. కాలేదు. మన మార్కెట్ ని హాలీవుడ్ సినిమాలు దెబ్బతీయడం ఏంటీ?.. తియ్యగల సత్తా వాటికి వుందా? .. కామెడీ కాకపోతే.. అని ఇండస్ట్రీ వర్గాలతో పాటు బన్నీ ఫ్యాన్స్ సెటైర్లు వేస్తున్నారు.

# టాప్ 10 లో తెలుగు.. తమిళ స్టార్స్ మాత్రమే

సోషల్ మీడియాలో స్టార్ హీరోల అభిమానులు ఈమధ్య కాలంలో చేస్తున్న హడావుడి అంతా ఇంతా కాదు. నెట్టింట స్టార్ హీరోల బర్త్ డేలు లేదా వారి సినిమాలకు సంబంధించిన విషయాలు రెగ్యులర్ గా వైరల్ అవుతూనే ఉన్నాయి. బాలీవుడ్ హీరోలను మించిన ఫాలోయింగ్ సోషల్ మీడియాలో సౌత్ స్టార్ కు ఉంది అనడంలో సందేహం లేదు. హీరోలు అభిమానులు పోటీ పడి మరీ హ్యాష్ ట్యాగ్స్ ను ట్రెండ్ చేస్తూ ఉన్నారు. నెట్టింట పెద్ద ఎత్తున ట్రెండ్




అవుతున్న మన స్టార్స్ ను ట్విట్టర్ ఇండియా గుర్తించింది. ప్రతి ఏడాది కూడా ఆ ఏడాది అత్యధికంగా ట్రెండ్ అయిన స్టార్ ను ట్విట్టర్ ప్రకటిస్తుంది. ఈ ఏడాదికి గాను టాప్ 10 స్టార్స్ ను ట్విట్టర్ అన్ని విభాగాల్లోనూ ప్రకటించింది. 2021 మోస్ట్ ట్విట్టెడ్ హీరోల జాబితాను ట్విట్టర్ విడుదల చేసింది. ఈ టాప్ 10 జాబితాలో తమిళ హీరోలు అయిదు మంది తెలుగు హీరోలు అయిదు మంది ఉన్నారు. ఇదే సౌత్ సినీ ఇండస్ట్రీకి చెందిన కన్నడ మరియు మలయాళ స్టార్స్ కు ఈ జాబితాలో చోటు దక్కలేదు. నెం.1 స్థానంలో తమిళ సూపర్ స్టార్ విజయ్ నిలిచాడు. తమిళనాట విజయ్ అభిమానులు చేసే సందడి అంతా ఇంతా కాదు. ఆయన ఏ సినిమా విడుదల అయినా.. ఏ ప్రత్యేక సందర్భం అయినా కూడా పెద్ద ఎత్తున ట్రెండ్ చేసేందుకు అభిమానులు సిద్ధంగా ఉంటారు. అందుకే ఈ ఏడాది సౌత్ ఇండియన్ స్టార్ హీరోల్లో విజయ్ గురించి అత్యధికులు ట్వీట్స్ చేయడం జరిగింది. నెం.2 లో పవన్ కళ్యాణ్ ఉన్నాడు. ఆయన సినిమాల గురించి మరియు ఆయన రాజకీయ కార్యక్రమాల గురించి రెగ్యులర్ గా సోషల్ మీడియాలో పవన్ గురించిన చర్చ జరుగుతుంది. అందుకే పవన్ కు నెం.2 దక్కింది. ఇక నెం.3 లో మహేష్ బాబు ఉన్నాడు. నెం.4 లో సూర్య మరియు నెం.5 లో ఎన్టీఆర్ లు ఉన్నారు. నెం.6 లో అల్లు అర్జున్ ఉండగా ఆ తర్వాత స్థానంలో తమిళ సూపర్ స్టార్ రజినీకాంత్ ఉన్నారు. నెం.8 లో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ఉండగా నెం.9 లో ధనుష్ ఉన్నాడు. ఇక నెం.10 లో తమిళ స్టార్ హీరో అజిత్ ఉన్నాడు. ట్విట్టర్ సౌత్ ఇండియన్ స్టార్ హీరోయిన్స్ జాబితాను కూడా విడుదల చేసింది. అందులో నెం.1 లో కీర్తి సురేష్ నిలువగా నెం.2 లో మాత్రం పూజా హెగ్డే నిలిచింది.

# సెలక్టర్లకు తలనొప్పిగా మారుతున్న రుతురాజ్.. తాజా ఫీట్‌తో కోహ్లి సరసన



సీఎస్కే స్టార్ ఆటగాడు రుతురాజ్ గైక్వాడ్ భీకరమైన ఫామ్లో ఉన్నాడు. దేశవాళీ టోర్నీ అయిన విజయ్ హజారే ట్రోఫీలో పరుగుల సునామీ సృష్టిస్తున్నాడు. మహారాష్ట్రకు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న రుతురాజ్ సెంచరీలను మంచినీళ్ల ప్రాయంగా అందుకుంటున్నాడు. ఇప్పటికే మూడు సెంచరీలు బాదిన రుతురాజ్ తాజాగా చండీఘర్‌తో ముగిసిన లీగ్ మ్యాచ్‌లో మరో సెంచరీతో మెరిశాడు. 95 బంతుల్లో 100 పరుగులు చేసిన రుతురాజ్‌కు.. తాను ఆడిన ఐదు మ్యాచ్‌ల్లో ఇది నాలుగో సెంచరీ కావడం విశేషం. ఈ సెంచరీతో విజయ్ హజారే ట్రోఫీలో 500 పరుగులు పూర్తి చేసిన రుతురాజ్ ఒక రికార్డును అందుకున్నాడు. విజయ్ హజారే ట్రోఫీలో ఒకే సీజన్‌లో నాలుగు సెంచరీలు చేసిన వారిలో విరాట్ కోహ్లి, దేవదత్ పడిక్కల్, పృథ్వీ షాలు మాత్రమే ఉన్నారు. తాజాగా వీరి సరసన రుతురాజ్ గైక్వాడ్ చేరాడు. విజయ్ హజారే ట్రోఫీ ద్వారా తన పరుగుల దాహాన్ని తర్చుకుంటున్న రుతురాజ్ ప్రస్తుతం సెలక్టర్లకు పెద్ద తలనొప్పిగా మారాడు. రుతురాజ్‌ను వెంటనే టీమిండియాకు ఎంపిక చేయాలంటూ అభిమానులు సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున్న కోరుతున్నారు. దక్షిణాఫ్రికా సిరీస్ ముగిసేలోపు రుతురాజ్ పేరును టీమిండియాలో చూసినా ఆశ్చర్యపోనక్కర్లేదు. మ్యాచ్ విషయానికి వస్తే.. లీగ్‌లో మహారాష్ట్ర మరో విజయాన్ని దక్కించుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన చండీఘర్ నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 309 పరుగులు చేసింది. కెప్టెన్ మనన్ వోహ్రా (139 బంతుల్లో 141, 13 ఫోర్లు, 2 సిక్సర్లు) అద్భుత సెంచరీతో మెరవగా.. అర్‌స్లాన్ ఖాన్ 87, అంకిత్ కౌశిక్ 56 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన మహారాష్ట్ర 48.5 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని చేధించింది. రుతురాజ్ గైక్వాడ్(132 బంతుల్లో 168 పరుగులు, 12 ఫోర్లు, 6 సిక్సర్లు) మరో అద్భుత ఇన్నింగ్స్ ఆడగా.. చివర్లో అజీమ్ కాజీ 73 పరుగులతో రాణించాడు. ప్రస్తుతం రుతురాజ్ 5 మ్యాచ్‌ల్లో 603 పరుగులతో టాప్ స్కోరర్‌గా కొనసాగుతున్నాడు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190